## ఏపీలో మరో దారుణం

## : జువైనల్ హెూంలో మైనర్ బాలికపై అత్యాచారం..

అమరావతి : ఈ మధ్యకాలంలో కొందరు మగాళ్లు మృగాళ్లుగా ప్రవర్తిస్తూ అభశుభం తెలియని చిన్నారుల జీవితాలను ఆదిలోనే చిదిమేస్తున్నారు. ఇటీవలే కోల్కతాలో జరిగిన అత్యాచార మరియు హత్య సంఘటన మరువకముందే ఏపీలో మరో దారుణం చోటు చేసుకుంది.. తిరుపతిలోని ఓ జువైనల్ హెూంలో 14ఏళ్ళ బాలికపై అత్యాచార ఘటన కలకలం రేపింది. పూర్తి వివరాల్లోకి వెళితే తిరుపతి పరిసర ప్రాంతంలోని జువైనల్ హెూమ్ నందు ఓ బాలిక ఉంటోంది. అయితే ఈ బాలిక స్థానికంగా ఉన్న నెహ్రూ మున్సిపల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా ఈ మధ్యకాలంలో రిషి అనే ఓ యువకుడు బాలిక రాకపోకలను గమనిస్తూ ఆమెపై కన్నేశాడు. ఈ క్రమంలో బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. అలాగే ఈ విషయం గురించి ఎవరికైనా చెబితే తనని హత్య చేస్తానని బెదిరించాడు. దీంతో బాలిక కిక్కురుమనకుండా ఉండిపోయింది. కానీ బాలిక ప్రవర్తనలో మార్పు గమనించిన కొందరు తోటి విద్యార్థులు ఏమైందని బాలికను అడగ్గా అసలు నిజం చెప్పింది. దీంతో విద్యార్థులు జువైనల్ సూపర్డెంట్ నయోమి కి తెలియజేశారు. అయితే నయోమి ఈ విషయం బయటికిపొక్కితే ఉద్యోగానికి ముప్పు వస్తుందని భావించి పై అధికారులకి తెలియకుండా దాచే ప్రయత్నం చేసింది. కానీ జువైనల్ హెూమ్ లో వైద్య చికిత్సలు నిర్వహించే డాక్టర్ ద్వారా ఈ విషయం బయటికి తెలియడంతో అధికారులు సూపర్డెంట్ నయోమి పై మండిపడ్డారు. అలాగే మైనర్ బాలికపై ఇంతటి దారుణానికి ఒడిగట్టిన యువకుడిపై పలు సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి కటకటాల్లోకి నెట్టాలని ఆదేశాలు జారీ చేసారు.

## మావైపు నిలబడండి ప్లీజ్.. మోదీకి జెలెన్ స్కీ విజ్ఞప్తి

ఢిల్లీ: ఉక్రెయిన్ సార్వభౌమత్వం కాపాడుకోవడానికి పోరాడుతున్న తమకు భారత్ అండగా నిలబడాలని ఆ దేశ ప్రెసిడెంట్ వొలొదిమిర్ జెలెన్ స్కీ భారత ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. తటస్థంగా ఉండొద్దని కోరారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుందని హామీ ఇచ్చారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో తాము తటస్థంగా లేమని వివరించారు. యుద్ధాన్ని నిలవరించేందుకు ఎలాంటి సాయానికైనా తాను ముందుంటానని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. ఉక్రెయిన్ పర్యటనలో భాగంగా కీవ్ లో మోదీని స్వాగతించిన జెలెన్ స్కీ కన్నీటిపర్యంతం కాగా తానున్నామంటూ మోదీ ధైర్యం చెప్పారు. యుద్ధం కారణంగా చనిపోయిన చిన్నారుల ఫొటోలు చూస్తూ జెలెన్ స్కీని హత్తుకుని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం జెలెన్ స్కీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. యుద్ధాన్ని ఆపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురూ చర్చించుకున్నారు. భారత దేశం నుంచి తీసుకెళ్లిన మందులు, వైద్య పరికరాలను మోదీ ఉక్రెయిన్ ప్రెసిడెంట్ కు అందజేశారు. ఇటీవల ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను ఆత్మీయ ఆలింగనం చేసుకున్న ఫోటో ఇంటర్ నెట్ లో వైరల్ గా మారిన విషయం తెలిసిందే. ఈ ఫొటో చూసిన జెలెన్ స్కీ తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రతినిధి, ప్రపంచంలోనే అత్యంత నియంతను కౌగిలించుకున్నారంటూ వ్యాఖ్యానించారు. ఇది ఉక్రెయిన్- రష్యాల మధ్య శాంతి నెలకొల్పే ప్రక్రియకు మంచిది కాదని జెలెన్ స్కీ అప్పట్లో వాపోయారు.

## గ్రామ సచివాలయ ఉద్యోగులకు

## చంద్రబాబు సర్కార్ గుడ్ న్యూస్

అమరావతి : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి శుక్రవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాల స్థాయిలోనే బదిలీలకు అవకాశం కల్పిస్తోంది. బదిలీ కోరుకుంటున్న ఉద్యోగులు ఈ నెల 27లోగా అధికారిక వెబ్ సైట్ లో లాగిన్ లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ధరఖాస్తులను కలెక్టర్ లు పరిశీలించి వాటిని ప్రాధాన్యత కేటగిరీల వారీగా విభజిస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో బదిలీల కౌన్సిలింగ్ కు దరఖాస్తు చేసుకున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు హాజరు కావాల్సి ఉంటుంది. పాలనా కారణాలు ఉంటే ఏ ఉద్యోగినైనా తప్పనిసరిగా బదిలీ చేసే అధికారం కూడా కలెక్టర్ లకు ఉంటుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. అలాగే ఏసీబీ, విజిలెన్స్ కేసులు ఉన్న ఉద్యోగులను బదిలీలకు అనర్హులుగా పేర్కొంది. బదిలీ అయిన ఉద్యోగులకు టీటీఏ గానీ మరే ఇతర ప్రయోజనాలు కూడా లభించవు. ఏ ఉద్యోగీ తమ స్థానిక గ్రామ, వార్డుల్లో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేయకూడదు. నాన్ ఐటీడీఏ ప్రాంతాలతో పోలిస్తే ఐటీడీఏ ప్రాంతాలకు బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు. మ్యూచువల్, స్పౌజ్, మెడికల్, విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు మించి పని చేసిన వారు బదిలీకి అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది.

## మహిళా కమిషన్ కార్యాలయానికి కేటీఆర్...

## కార్యాలయం ఎదుట హైడ్రామా

అమరావతి : మహిళలంటే తనకు ఎంతో గౌరవం ఉందని... ఏదో యథాలాపంగానే తాను మాట్లాడానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళలపై ఉన్న గౌరవంతోనే విచారణ కోసం మహిళా కమిషన్ కు వచ్చానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరి సరికాదని అన్నారు. రాష్ట్రంలోని సమస్యలను మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణంపై ఇటీవల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ కేటీఆర్ కు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆయన కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. మరోవైపు కేటీఆర్ రాక సందర్భంగా మహిళా కమిషన్ ఎదుట పెద్ద డ్రామా నడిచింది. కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు డిమాండ్ చేయగా... రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో రెండు పార్టీల మహిళా కార్యకర్తలు పోటీపోటీగా నినాదాలు చేశారు. ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరగడంతో పోలీసుల వచ్చి అడ్డుకున్నారు.

## మోదీ, యోగిని ప్రశంసించిన ముస్లిం మహిళ...

## ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్త

నరేంద్రమోదీని, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ను ప్రశంసించినందుకు గాను ఆమెకు భర్త "తలాక్" చెప్పాడు. అయోధ్యను అభివృద్ధి చేసినందుకు గాను ఆమె ప్రధానిని, సీఎంను ప్రశంసించింది. దీంతో తన భర్త ట్రిపుల్ తలాక్ చెప్పినట్లు ఆమె ఆరోపించింది. ఈ నేపథ్యంలో, ఆమె తన భర్తతో పాటు, కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అత్త, భర్త, ఇతర కుటుంబ సభ్యులు తనను కొట్టారని ఆరోపించింది. తన భర్త కుటుంబ సభ్యులు తన గొంతు పిసికేందుకు ప్రయత్నించారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. మొహల్లా సరాయ్ ప్రాంతానికి చెందిన ముస్లిం మహిళకు గత ఏడాది డిసెంబర్ 13న అయోధ్యలోని మొహల్లా ఢిల్లీ దర్వాజా ప్రాంతానికి చెందిన అర్షద్తో వివాహం జరిగింది. పెళ్లి తర్వాత అయోధ్యలోని అత్తారింటికి చేరుకున్న సదరు మహిళకు అక్కడి రోడ్లు, సుందరీకరణ, అభివృద్ధి, వాతావరణం చాలా నచ్చాయి. దీంతో భర్త ఎదుటే ఆమె సీఎం యోగి, ప్రధాని మోదీని ప్రశంసించింది. దీంతో ఆగ్రహించిన భర్త అర్షద్ భార్యను కొట్టడంతో పాటు కాలుతున్న పాన్ను ఆమె పైకి విసిరాడు. భార్యను పుట్టింటికి పంపించేశాడు. కొన్ని రోజుల తర్వాత బంధువుల జోక్యంతో ఆమె తిరిగి భర్త వద్దకు చేరుకుంది. అయితే మోదీ, యోగీని ప్రశంసించినందుకు అతడు భార్యను కొట్టడంతో పాటు ట్రిపుల్ తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడు. భర్తతో పాటు అత్తింటి వారు తనను వేధించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అర్షద్, అతని కుటుంబ సభ్యులతో సహా 8 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగుల్లో పోటీతత్వం రావాలి




హైదరాబాద్ : ఆర్టీసీ ఉద్యోగుల్లో పోటీతత్వం రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కళాభవన్లో సంస్థ ఉద్యోగులకు ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్తో పాల్గొన్నారు. ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ ఎం సంపత్ కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఆ తర్వాత ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో సంస్థకు అదృష్ట లక్ష్మి వచ్చిందన్నారు. కొత్త బస్సులు కొంటున్నామని.. త్వరలోనే నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లకాలంలో ముందస్తుగా దృష్టిలో పెట్టుకొని బస్సులు, రెండోసారి నియామకాలు చేపడుతున్నామన్నారు. 259వ రోజు 81 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.2750 కోట్ల విలువైన ప్రయాణాన్ని తెలంగాణ అక్కాచెల్లెల్లకు అందించామన్నారు. వ్యక్తిగతంగా డ్రైవర్, కండక్టర్, అధికారిగా, మంత్రిగా ఇది సంతృప్తి ఇచ్చే అంశమన్నారు. ఇంటర్నల్ ట్రాన్సురెన్సీని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. అత్యున్నంగా పని చేసిన వారికి అవార్డులు ఇస్తూ సన్మానం చేసుకుంటున్నామని.. మిగతా వారికి అవార్డులు పొందాలని పోటీతత్వం రావాలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్లో ఎలాంటి రిమార్క్ లేని డ్రైవర్లను జోనల్ వారీగా సన్మానం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం తరుపున ఆర్థిక పరమైన అంశాలు ఉన్నపటికీ కార్మికుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయి నుంచి ఆలోచిస్తున్నామన్నారు. బాండ్స్ రూ.80కోట్ల పెమెంట్స్ జరిగాయని.. రూ.200కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. దానికి నిధులు తీసుకొచి.. చెల్లించే బాధ్యత మాదన్నారు. రాఖీ పండగ రోజున 17 కోట్ల ప్రయాణాలు జరిగాయన్నారు. దాంతో రికార్డు స్థాయిలో రూ.14.90 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రికార్డు స్థాయిలో 64 లక్షల మంది ప్రయాణం చేశారన్నారు. ఇది సిబ్బంది కృషితోనే జరిగిందన్నారు. ఆర్టీసీలో ఉద్యోగి ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.కోటి బీమా ఇచ్చేలా యూనియన్ బ్యాంక్తో ఎంవోయూ చేసుకున్నామన్నారు.

# చంద్రబాబు ఆవేశం మంచిదేనా...!

మొదటి పేజి తరువాయి



అది కూడా అప్రతిహత విజయం దక్కించుకున్నారు. మరి అలాంటప్పుడు.. కూడా ఫక్తు రాజకీ య కామెంట్లు అవసరమా? అనేది ఇప్పుడు చంద్రబాబు ప్రసంగం విన్నవారికి అనిపిస్తున్న భావన. పైగా వివాదాస్పదంగా కూడా ఉండడం గమనార్హం. ఇప్పటికే.. తమపై దాడులు చేస్తున్నారని.. తమ నాయకు లను హత్య చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ విరుచుకుపడుతున్నారు. ఇలాంటి సమయంలో చంద్రబాబు ఆచి తూచి మాట్లాడాలి. వైసీపీ ప్రస్తావన లే కుండా.. ఉన్నా వివాదం కాకుండా కూడా ఆయన వ్యవ హరించాలి. కానీ, ఎందు కో.. చంద్ర బాబు ఆవేశ పడు తు న్నారు. ఆయన మనసులో ఏముందో ఏమో తెలియదు కానీ.. మాటలు తూలుతున్నారు. తాజాగా కోనసీమలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడిన చంద్రబాబు.. జగన్ను టార్గెట్ చేసుకున్నారు. ఇది సహజమే. గత ప్రభుత్వం ఏమీ చేయలేదు.. కాబట్టి అంతా మేమే చేస్తున్నామని చెప్పుకోవడం.. ప్రభుత్వాలకు కామన్. ఇంత వరకు చంద్రబాబు ఆగిపోయి ఉంటే బాగుండేది. కానీ, ఇదే సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదం అయ్యాయి. "వైసీపీని మీరు(ప్రజలు) తరిమి కొట్టారు. 11 స్థానాలకే పరిమితం చేశారు. అయినా బుద్ధి రాలేదు. జగన్ భూతం ఇంకా వేలాడుతోంది. దీనిని భూస్థాపితం చేయాలి" అని చంద్రబాబు అన్నారు. ఈ వ్యాఖ్యలే వివాదానికి దారి తీశాయి. 'భూస్థాపితం' అంటే.. తమ నాయకుడిని చంపేసేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారంటూ.. వైసీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎన్నికల సమయంలోనూ ఇలానే చంద్రబాబు వ్యాఖ్యాని ంచారు. అయితే.. అప్పట్లో పరిస్థితి ఎలా ఉన్నా.. ఇప్పుడు మాత్రం ఆయన బాధ్యతాయుత ముఖ్య మంత్రి స్థానంలో ఉండి.. భూస్థాపితం చేస్తాము.. అంటే కుదరదు కదా! ఏదైనా రాజకీయంగా చూసుకోవచ్చు కానీ.. బహిరంగ వేదికలపై ఇలా వ్యాఖ్యానించడం ద్వారా.. బాబు సంయమనం కోల్పో తున్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకుంటే బెటర్ అనేది రాజకీయ వర్గాల సూచన. సూచపైగా.. అధినేతే ఇలా మాట్లాడితే.. క్షేత్రస్థాయి నాయ కులు మరింత రెచ్చిపోతున్నారు. దీనివల్ల మరిన్ని ఇబ్బందులు రావడం ఖాయం.

# డ్రగ్స్ పై ఉక్కుపాదం.. హైడ్రా దడ.. ఫుడ్ సేఫ్టీ హడల్..

మొదటి పేజి తరువాయి



నాణ్యత పాటించని హెూటల్ యజమానులపై ఉక్కుపాదం.. అన్నీ ఏకకాలంలో.. సర్కారు అంటే చురుకు పుట్టేలా తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నలుగురి నోళ్లలో నానుతోంది. పది నెలలు పూర్తిచేసుకుంటున్న కాంగ్రెస్ సర్కారు ఇకమీదట తన ముద్ర చూపే దిశగా అడుగులేస్తోంది. వాస్తవానికి డిసెంబరులోనే అధికారంలోకి వచ్చినా.. మధ్యలో లోక్ సభ ఎన్నికలతో రెండు నెలలు కోడ్ కింద పోయింది. ఆ గ్యాప్ తర్వాత పూర్తిగా ఫోకస్ పెట్టాల్సిన సమయం వచ్చింది. ఇప్పుడు అదే పనిచేస్తోంది రేవంత్ ప్రభుత్వం. అక్ర మార్కులపై పిడుగు హైడ్రా చెరువులు.. నేచర్ అందించిన పెద్ద వనరు. అలాంటివాటి సహజ ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ నిర్మాణాలు చేపడితే.. వర్షాకాలంలో వరదలు ఊళ్లోకి వస్తుంది. కానీ, ఎవరేం చేస్తారులే అనుకుంటూ.. ఆక్రమణే ధ్యేయంగా పెట్టుకున్న కొందరు బడాబాబులు హైదరాబాద్ లో చెరువులను చెరబట్టారు. హైదరాబాద్ తాగునీటికి ఒకప్పుడు గుండెకాయలాంటి గండిపేట జలాశయం ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో ఓ కేంద్ర మాజీ మంత్రి ఏకంగా పది ఎకరాలను కబ్జా చేసేశారు. ఈయన దేశానికి అత్యంత కీలకమైన శాఖను చూసిన మంత్రి కావడం గమనార్హం. అలాంటి ఆయనే చెరువుల 'రక్షణ'ను మరిచారు. గత ఆదివారం గండిపేట, హిమాయత్ సాగర్ జంట జలాశయాల పరిధిలో ఆక్రమణలకు పాల్పడ్డ పది నిర్మాణాలను కూల్చివేశారంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇప్పుడు హైడ్రా ఎక్కడ దాడి చేస్తుందోననే ఆందోళన అక్రమార్కుల్లో నెలకొంది. ఇక శనివారం సినీ హీరో నాగార్జున సైతం చెరువును ఆక్రమించి నిర్మాణం చేపట్టారనే ఆరోపణలపై చర్యకు దిగింది. అయితే, ఈ నిర్మాణంపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఆరోపణలు వచ్చాయి. కూల్చివేత ప్రయత్నాలూ జరిగాయి. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలకు దిగింది. కాగా.. ఈ వ్యవహారం కోర్టులో ఉందని.. స్టే ఆర్డర్ ఇచ్చినా చట్ట విరుద్ధంగా కూల్చారని నాగార్జున ప్రకటన విడుదల చేశారు. మరోవైపు హైడ్రాపై కొందరు కోర్టుకు కూడా వెళ్లారంటేనే ఆ సంస్థ దూకుడు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైడ్రా.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ అనేది సీఎం రేంత్ మానస పుత్రిక. దీని అధికారాల పరిధి కూడా ఎక్కువే. హైదరాబాద్ ను విశ్వ నగరంగా నిలిపే ఉద్దేశంలో హైడ్రాను తీసుకొచ్చారు రేవంత్. డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం ఎవరు ఔనన్నా.. కాదన్నా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశంలోనూ గంజాయి, డ్రగ్స్ ఇప్పుడు పెద్ద సమస్యగా మారాయి. ఒకప్పుడు మత్తు పదార్థాలు అంటే ఎక్కడో అత్యంత రహస్య ప్రదేశంలో అమ్మేవారు. ఇప్పుడు సాధారణ దుకాణాల్లోకీ వచ్చేశాయి. ఇక హైదరాబాద్ పబ్ లలో డ్రగ్స్ గురించి ఎన్నెన్నో కథనాలు. అయితే, డ్రగ్స్, గంజాయి అనే మాటే వినపడేందుకు వీల్లేదన్న సీఎం రేవంత్ ఆదేశాల మేరకు పోలీసులు, టీఎస్ న్యాబ్ అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటికే హైదరాబాద్ పబ్ లపై వరుసగా దాడులు చేస్తున్నారు. కీలకంగా వ్యవహరిస్తున్న డీజే (డిస్క జాకీ)లనూ పట్టుకుని లోపలేశారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ పోలీసులు తనిఖీలు, దాడులు చేస్తున్నారు. ఆహార భద్రతకు అహరహం హైదరాబాద్ అంటేనే బిర్యానీ.. బిర్యానీ అంటే హైదరాబాద్. అలాంటి బిర్యానీలను విక్రయించే రెస్టారెంట్లు ప్రమాణాలు పాటించడం లేదు. అన్నీ రెస్టారెంట్లు, హెూటళ్లు కాకున్నా.. పేరున్న కొన్ని నాసిరకం నూనెలు, ఫ్రిజ్ లో ఉంచిన చికెన్, మటన్ వినియోగిస్తున్నట్లు తేలింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగారు. హైదరాబాద్ లోనే కాక రాష్ట్రవ్యాప్తంగానూ దాడులు చేస్తూ.. ఆహార ప్రమాణాలపై రాజీ లేదని చాటుతున్నారు. ఇందులో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాత్ర కూడా చాలా కీలకం అనే చెప్పాలి. ఉమ్మడి ఏపీకి డిప్యూటీ సీఎంగా పనిచేసిన సమయంలో కంటే ఆయన ఇప్పుడు పవర్ ఫుల్ గా కనిపిస్తున్నారు. ఇది ఆగొద్దు.. ఏపొద్దు ఆపొద్దు తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం ఇప్పటివరకు పెద్దగా ప్రజలను ఆకట్టుకునే కార్యక్రమాలు చేయలేదనేది వాస్తవం. రైతు రుణ మాఫీ, ఉచిత బస్సు ప్రయాణం అమలు తదితర సూపర్ సిక్స్ హామీలు తప్ప కీలకమైన చర్యలు తీసుకోలేదనే వాదన ఉంది. ఉదాహరణకు మొక్కలు నాటే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిన సమయంలో సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో ఉన్నారు. దీంతో అది ఓ మొక్కుబడి కార్యక్రమంగా సాగింది. అయితే, ఇప్పుడు రేవంత్ సర్కారు ఒక్కసారిగా రంగంలోకి దిగి దూకుడు చూపుతోంది. అయితే, ప్రభుత్వం అంటే నిరంతర కార్యక్రమం. తలపెట్టిన కార్యక్రమాలను నిరంతరం ముందుకు తీసుకెళ్తూ ఉండాలి. ఎక్కెళ్తూ ఉండాలి. ఎ %మరో% కడా స్తబ్దత రాకూడదు. ఎక్కడైనా నిశ్చలం అయితే అప్పటివరకు చేసినదంతా వేస్ట్ అవుతుంది. దీనిని మనసులో పెట్టుకుని రేవంత్ సర్కారు ప్రయత్నాలు చేస్తే ప్రజల్లో మంచి పేరు రావడం ఖాయం.

# గుజరాత్ నో...అమరావతి ఎస్...

మొదటి పేజి తరువాయి




అమరావతి : దేశంలో కొన్ని రాష్ట్రాలలో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ఉత్సాహం చూపిస్తాయి. ఆ విషయంలో రాజకీయ లాబీయింగ్ కూడా చేసుకుంటాయి. అధికార ప్రభుత్వాల వెంట పడతాయి. అదే ఏపీ లాంటి చోట్ల అయితే ప్రభుత్వమే పారిశ్రామికవేత్తలను పిలవాల్సి ఉం టుంది. వారి కోసం అన్ని రెడీ చేసి రాయితీలను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఏపీ లాంటి వాటికి ఈ రకమైన పరిస్థితి ఎందుకు అంటే పూర్తిగా వ్యవసాయిక రాష్ట్రం. పైగా పారిశ్రామిక వాతావరణం కూడా పెద్దగా ఉండదు. అందుకే పరిశ్రమలు ఈ వైపు చూడాలంటే ప్రభుత్వాలు రంగంలోకి దిగాల్సిందే. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో అమరావతి రాజధానికి కొత్త కళ కనిపిస్తోంది. ప్రతీ రోజూ ఏదో పరిశ్రమ పెట్టుబడులు పెట్టడానికి వస్తోంది. దాంతో అమరావతి రాజధానికి మంచి బూమింగ్ వస్తోంది. ఇంకా ఒక రూపూ షేపూ రాకుండానే పరిశ్రమలు క్యూ కడుతున్నాయని కూటమి పెద్దలు చెప్పుకునేందుకు కూడా ఆస్కారం ఏర్పడుతోంది. అయితే ఇటీవల కాలంలోనే ఎందుకు ఇలా జరుగుతోంది ఏపీ విభజన జరిగి పదేళ్ళు అయింది. అమరావతి రాజధాని అని ప్రకటించి తొమ్మిదేళ్ళు అయింది. పైగా ప్రకటించిన తరువాత నాలుగేళ్ల పాటు చంద్రబాబు సీఎం గా ఉన్నారు. మరి ఆనాడు లేని ఈ మోజు ఇపుడే అమరావతి మీద పారిశ్రామికవేత్తలకు ఎందుకు కలిగింది అంటే అక్కడే ఒక బిగ్ స్టోరీ ఉందని అంటున్నారు. అమరావతిలో పెట్టుబడులు పెడితే బోలెడు రాయితీలు లభిస్తాయి. పైగా కొత్త రాష్ట్రం. తాము కోరింది చేయడానికి పాజిటివ్ గా ప్రభుత్వం ఉంది. ఇవన్నీ పెట్టుబడిదారులకు కలిసి వచ్చే అంశాలు. అమరావతిని ఫుల్ గా డెవలప్ చేయాలని ప్రభుత్వం గట్టి సంకల్పంతో ఉండడం కూడా మరో కలిసి వచ్చే అంశం. అయినా సరే ఇప్పటిదాకా అమరావతి వైపు చూడని వారు ఇపుడే తొంగి చూసి వంగి వాలుతున్నారు ఎందుకు అంటే కేంద్రంలోని పెద్దలే ఒక దారి చూపిస్తున్నారు అని అంటున్నరు. కేంద్ర పెద్దలు గుజరాత్ కి సంబంధించిన వారే కావడం విశేషం. అలా గుజరాత్ లో పరిశ్రమలు కొత్తగా పెడతామని చెప్పిన కొన్ని సంస్థలను ఏపీకి వెళ్లమని చెబుతున్నారని అందుకే వారు తరలి వస్తున్నారు అని అంటున్నారు. ఇక గుజరాత్ లో పారిశ్రామిక పాలసీ కూడా కొందరికి ఇబ్బందిగా ఉందని అంటున్నారు గుజరాత్ లో అయితే కంపెనీలు పెట్టేందుకు ఇచ్చే భూమిలో ఇరవై అయిదు శాతం ఆర్థిక భారం ఆ కంపెనీలు భరించాలిట. ఇక పన్ను రాయితీలు ఏమీ లేవు. అదే అమరావతిలో అయితే భూమి ఫ్రీ. పన్నులలో రాయితీలు భారీగా ఉన్నాయి. అందుకే ఈ వైపు చూస్తున్నారు అని అంటున్నారు. పైగా గుజరాత్ లో కంపెనీలతో రష్ గా ఉంది. అందుకే రాయితీలు పెద్దగా ఇచ్చి వారిని ప్రత్యేకంగా ఆహ్వానం చేయాల్సిన పని లేదు అని అంటున్నారు. అదే ఏపీకి అయితే అన్ని అవసరాలూ ఉన్నాయి. దీంతో వీటిని చూసిన కేంద్ర పెద్దలే ఈ విధంగా ఏపీకి వెళ్ళండి అని తరుణోపాయం ఆయా పరిశ్రమల పెద్దలకు చెబుతున్నారుట. అది కూడా మామూలుగా జరగడం లేదు. ఏపీ సీఎం చంద్రబాబు విన్నపం మేరకే ఇదంతా చేస్తున్నారుట. ఏపీకి ప్రత్యేకించి నిధులు ఎటూ ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా లేదు. అందువల్ల తమకు పెద్దగా భారం లేకుండా తమ రాష్ట్రం నుంచి కొన్ని పరిశ్రమలను ఇటు మళ్ళించడం ద్వారా కొత్త రాజధానికి ఎంతో కొంత సాయం చేసినట్లు అవుతుందని భావిస్తున్నారుట. దాంతో ఏపీకి గోద్రేజ్ ఫాల్కాన్ వంటి పరిశ్రమలు వస్తున్నాయి. ఈ పరిశ్రమలకు గుజరాత్ లో ఒప్పందాలు సెట్ కావడం జరగలేదు అందుకే ఇలా దారి మళ్ళాయని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీకి ఇపుడు పెట్టుబడులు అవసరం అందుకే గ్రాండ్ వెల్ కం అంటోంది మరి.

## వైఎస్ వివేకాను హత్య చేసిన వారిపై ధర్నా చేయండి...

మొదటి పేజి తరువాయి



అచ్యుతాపురం సెజ్లో జరిగిన ప్రమాదంపై మాజీ సీఎం జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. అబద్ధాలు చెప్పడం జగన్కు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఎల్జీ పాలీమర్స్ ప్రమాదంలో 15 మంది మరణించగా.. ముగ్గురు మృతులకు ఇప్పటికీ కోటి రూపాయల పరిహారం అందలేదని గుర్తు చేశారు. అచ్యుతాపురం ప్రమాద ఘటనలో మృతి చెందిన 17 మంది కుటుంబసభ్యులకు, 36 మంది క్షతగాత్రులకు ఆర్టీజీఎస్ ద్వారా డబ్బులు అందజేశామని తెలిపారు. తెలిసి తెలియకుండా శవాల మీద పేలాలు ఏరుకున్నట్లు వైఎస్ జగన్ వ్యవహరించడం బాధాకరమని వంగలపూడి అనిత మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడూ మానిటరింగ్ చేసి ప్రమాద బాధితులకు న్యాయం చేశారని తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే పరిహారం అందించాలని.. లేదంటే తానే స్వయంగా ధర్నా చేస్తానని వైఎస్ జగన్ చేసిన ప్రకటనపై కూడా అనిత మండిపడ్డారు. బాబాయ్ వైఎస్ వివేకాను హత్య చేసిన వారిపై ధర్నా చేయాలని విమర్శించారు. ఎల్జీ పాలిమర్స్ వద్ద వైసీపీ ప్రభుత్వం తీసుకున్న రూ.150 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలని అనిత డిమాండ్ చేశారు. కాగా అచ్యుతాపురం ప్రమాదంలో గాయపడి గాజువాక పవన్ సాయి, విశాఖ మెడికవర్ హాస్పిటల్స్లో చికిత్స పొందుతున్న బాధితులను హెూంమంత్రి అనిత శుక్రవారం పరామర్శించారు. బాధితుల బ్యాంక్ ఖాతాలో పరిహారం డబ్బులు జమ చేసినట్లుగా కన్ఫర్మేషన్ ఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


## తగ్గేదేలే... ఎక్కడ ఉన్నా నాకు మంత్రి పదవి రావాల్సిందే ?

మొదటి పేజి తరువాయి



వాళ్లు ఎక్కడ ఉన్న రాజుల బతికేస్తున్నారు. ముఖ్యంగా కొంతమంది లీడర్లు ఏ పార్టీలో చేరినా కూడా... మంత్రి పదవి దక్కించు కోగలుగుతున్నారు. అలాంటి వారిలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఒకరు. బాలినేని శ్రీనివా సరెడ్డి వైయస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. బంధువు కూడా. 1999లో తన రాజకీయరంగేట్రం చేసిన బాలినేని శ్రీనివాస్ రెడ్డి... ఇప్పటివరకు ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం జరిగింది. అయితే 1999లో ఒంగోలు నియోజక వర్గం నుంచి.. మొదటిసారి కాంగ్రెస్ పార్టీ తరపున బాలినేని శ్రీనివాస్రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో కూడా బాలినేని శ్రీనివాసరెడ్డి విజయం సాధించడం జరిగింది. అయితే 2009 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా కూడా అవకాశం దక్కించుకున్నారు బాలినేని. ఆ సమయంలో చేనేత, జౌళీ శాఖ మంత్రిగా కూడా బాలినేని శ్రీనివాస్రెడ్డి పని చేయడం జరిగింది. ఇక వైయస్ రాజశేఖరెడ్డి మరణించిన తర్వాత వైసీపీలో చేరిపోయారు బాలినేని శ్రీనివాస్ రెడ్డి. వైసీపీలో చేరిన తర్వాత.. మరో రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇక మొన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు.. అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా కూడా బాలినేని పనిచేయడం జరిగింది. ముఖ్యంగా.. ఒంగోలు ఎమ్మెల్యేగా ఏకంగా ఐదు సార్లు విజయం సాధించి చరిత్ర సృష్టించారు బాలినేని శ్రీనివాసరెడ్డి. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో... దామరచర్ల జనార్దన్ రావు చేతిలో బాలినేని శ్రీనివాస్రెడ్డి ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో... రిగ్గింగ్ జరిగిందని... ఎన్నికల కమిషన్ కు బాలినేని శ్రీనివాస్రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఎన్నికలపై రీకౌంటింగ్ చేసేందుకు ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

## శ్రీరామ్ వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం వాస్తవ్యులు ప్రముఖ రియల్టర్ శ్రీరామ్ శ్రీనివాసులు, రత్నకుమారి దంపతుల ద్వితీయ పుత్రిక డాక్టర్ సంధ్య, పామూరు మండలం వెంకటాపురం వాస్తవ్యులు చెన్నం శెట్టి వెంకట నారాయణ, విజయలక్ష్మి దంపతుల ఏకైక పుత్రుడు డాక్టర్ వీర నరేంద్ర వర్మ ల వివాహ వేడుకలు పామూరులోని పువ్వాడి రాధాకృష్ణ కళ్యాణ మండపం నందు శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. సిఎస్ పురం సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బోయిళ్ళ నారాయణరెడ్డి, కదిరి ప్రకాశరావు, కదిరి పార్థసారథి, డాక్టర్ గద్దె ఏడుకొండలు, పువ్వాడి వెంకటేశ్వర్లు దంపతులు, అల్లు శ్రీనివాసులు దంపతులు, బుజ్జి బ్రదర్స్, పోక నాయుడు బాబు, శ్రీరామ్ వారి బంధుమిత్రులు, చెన్నం శెట్టి వారి బంధుమిత్రులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## శ్రీ రాధాకృష్ణుల కళ్యాణ మహోత్సవానికి బైరెడ్డి, దారపనేని కి ఆహ్వానం



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు పంచాయితీ పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో శ్రీ ఆవుదేవర మరియు శ్రీ రాధాకృష్ణ దేవాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా రాధాకృష్ణుల కళ్యాణ మహోత్సవము సోమవారం నిర్వహిస్తున్న నేపథ్యంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకట సుబ్బయ్య, బాలాజీ జ్యువెలర్స్ ప్రొప్రైటర్ గుత్తి వెంకటరాజాలకు శనివారం దార పనేని క్యాంపు కార్యాలయంలో శ్రీ ఆవుదేవర మరియు శ్రీ రాధాకృష్ణ దేవాలయం నిర్వహణ కమిటీ వారు తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య, చెనికల కొండయ్య (పెద్దాయన) కొండల్ రావు, శివకృష్ణ, సురేష్, మనోజ్, మల్లికార్జున, ప్రభాకర్, మహేంద్ర, బొడ్డు కళ్యాణ్ ఆహ్వాన పత్రిక అందజేశారు.

## సిఐ భీమా నాయక్ కు శుభాకాంక్షలు తెలిపిన ఉప్పలపాటి హరిబాబు





ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన భీమా నాయక్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన తెలుగు యువత పామూరు మండల అధ్యక్షులు, టిడిపి పట్టణ ఫోర్ మెన్ కమిటీ సభ్యులు మాజీ ఎంపీటీసీ ఉప్పలపాటి హరిబాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. సీఐకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జెసిబి కోటిరెడ్డి, బత్తుల సత్యనారాయణ, ముబీనా మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న

### ఏల్చూరి బాలకొండలరావు దంపతులు



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని తిరగలిదిన్నె గ్రామంలో అభిరామ్ హెూటల్స్ అధినేత పచ్చిపులుసు శ్రీరాములు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మితమైన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన పామూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన చైర్మన్ ఏల్చూరి బాలకొండలరావ్ దంపతులు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్ స్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు





కనిగిరి ఆర్సి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): స్థానిక కేటీఆర్ స్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమానికి స్కూల్ చైర్మన్ కుందురు తిరుపతి రెడ్డి , కరస్పాండెంట్ సూరా రఘురామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ భక్తి మార్గంలో నడవాలని సూచించారు. అలాగే కరస్పాండెంట్ గారు మాట్లాడుతూ కృష్ణాష్టమి పండుగ యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. తదనంతరం చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణతో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆనందపరిచాయి. చివరిగా ఉట్టి కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల ఆనందోత్సాహాలతో ఆవరణమంతా పండుగ వాతావరణం నెలకొంది. పై కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అచ్చాల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్నదద్దాల



కనిగిరి ఆర్సి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): కనిగిరి మునిసిపాలిటీ పరిధిలోని కొత్తూరు లో అచ్చాల వివాహ వేడుకలో కనిగిరి వైసీపీ ఇంఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చాల శ్రీనివాసరెడ్డి, ఆచ్చాల అంజిరెడ్డి,మున్సిపల్ చైర్మన్ గఫూర్,జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి,వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, గొబ్బిళ శ్రీను,సంగటి మహేంద్ర రెడ్డి,తమ్మినేని రమణారెడ్డి, యలకృష్ణారెడ్డి,కెవి.సుబ్బారెడ్డి, సైకేం ఏడుకొండలు ఇతరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఎస్ టి ఎస్ ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలి

### : ఐక్య విద్యార్థి సంఘాలు



తనకల్లు, (శుభోదయం న్యూస్): 2019 నుండి 2024 వరకు ఎస్టిఎస్ఎన్ కళాశాలకు వచ్చిన ఎంత నిధుల వచ్చినాయి,వాటిని ఎలా ఉపయోగించారో విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. ఈ సంధ్బంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా కదిరి పట్టణంలో ఉన్నటువంటి ఎస్టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గత ఐదు సంవత్సరాలుగా ఎంత నిధులు వచ్చిన ఏటువంటి మరమత్తులు, అభివృద్ధి పనులు చేయకుండా ప్రిన్సిపాల్ గారు గాలికి వదిలేశారు. ఈ విషయమే గతంలో ముఖద్వారం, నేమ్ బోర్డు,బిల్డింగ్ మెయింటెన్స్, తరగతి గదుల మరమత్తు విషయంలో ప్రిన్సిపల్ గారికి తెలపగా నిధులు లేవని చెప్పి చెప్పడం జరిగింది. రెండు నెలల కింద కూడా నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని అడిగితే నిధులు లేవని చెప్పారు.కానీ ఇప్పటికి ఇప్పుడు ఎక్కడ నుండి వచ్చినాయి నిధులు మరియు గత ఐదు సంవత్సరాలుగా ఎంత నిధులు వచ్చినాయని అడిగిన విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు పెడతామని బెదిరించడం జరుగుతున్నది. అంతేకాకుండా కళాశాలకు నిధులు లేవని చెప్పి మొన్నటికి మొన్న 15 ఏసీలు ఎందుకు తెచ్చారు,అలాగే కళాశాలకు ప్రభుత్వ నిర్ణయించిన రంగులు కాకుండా ఎందుకు సొంతంగా వేరే రంగులు వేయించారు. కళాశాలలో పనిచేసే విద్యార్థులను సొంత పనులకు ఉపయోగించుకోవడం వంటివి ఎలా చేస్తారు అని అడిగే విద్యార్థి నాయకులు రవద్దండి అని అడ్డుకుంటున్నారు.కావున సంబంధిత అధికారులు ఇప్పటికైనా విచారణ జరిపి ఎస్టిఎస్ఎన్ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. లేనిపక్షంలో విద్యార్థి సంఘల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో ఎఐఎస్పి జిల్లా అధ్యక్షులు నరసింహ,ఆర్ఎస్వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్,ఎన్ఎస్యూఐ నాయకులు ఉపేంద్ర,ఎఐఎస్ఓ కార్యదర్శి నిరంజన్,సాయి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రెడ్ బుక్ అంటే జగన్ కి వణుకెందుకో

### లోకేష్ సరిగ్గా వాడితే జగన్ కు ముచ్చెమటలు ఖాయం


### నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం



బాపట్ల పట్టణం, (శుభోదయం న్యూస్) ఆగస్టు 24 : లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడిపితే జగన్ మోహన్ రెడ్డి బయట ఎలా తిరుగుతున్నారో సమాధానం చెప్పాలని నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం చిలకలూరిపేట అన్నారు.రెడ్ బుక్ బయటకు తీస్తే గత ప్రభుత్వం లోని అరాచకం చేసిన వైస్సార్సీపీ నేతలు 80% మంది జైల్లో ఉండే వారని అయన అన్నారు.అచ్చుతాపురం వెళ్లిన జగన్ పరామర్శ వదిలి లోకేష్ రెడ్ బుక్ గురించి మాట్లాడటం చూస్తే అయన లోని భయం తేటతెల్లం అయిందని అన్నారుతప్పులు అవినీతిచేసిన వైసీపీ నేతలు రెడ్ బుక్ లో తమపేరుందేమోఅని ఆందోళనకు గురి కావడం సహజమే అనిఆ భయం జగన్ మోహన్ రెడ్డికి కూడా సహజంగానే ఉంటుందని రావు సుబ్రహ్మణ్యం తెలిపారు అచ్చుతాపురం సెజ్ ఘటనలో మృతి చెందిన భాదితులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు పరిహారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విషయం జగన్ జీర్ణించుకోలేక అసత్యాలు వండి వార్చేందుకు పరామర్శ కార్యక్రమం ఉపయోగించుకోవడం దురదృష్టకరం అని రావు సుబ్రహ్మణ్యం అన్నారు.

## వైఎస్ఆర్సిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా జక్కంపూడి

### జక్కంపూడి రాజాకు డాక్టర్ గూడూరి శుభాకాంక్షలు



రాజమహేంద్రవరం, (శుభోదయం న్యూస్) : వైయస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా నియ మితులైన వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజాకు రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ శనివారం శుభాకాంక్షలు చెబుతూ పుష్పగుచ్చం ఇచ్చి దుశ్శాలువాతో అభినందించారు. సరైన సమయంలో సరైన బాధ్యతలు అప్పగించినట్టుగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం చేసేందుకు ప్రజాపక్షాన పార్టీని పునరంకితం చేసేందుకు జక్కంపూడి రాజా సమర్థవంతమైన సేవలు అందిస్తూ యువజన విభాగం పటిష్టవంతానికి నాయకత్వాన్ని అందిస్తారని డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక అభినందించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా ఆయన సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ లను సాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. జక్కంపూడి రాజాకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక, మైనార్టీ సెల్ ఆరిఫ్, ఇన్నీసు పేట అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గుత్తుల భాస్కర్ తదితరులు ఉన్నారు.

## ఇష్టాన్ని సేవా రూపంలో చూపిస్తే సమాజం ఉన్నతంగా ఉంటుంది



రాజమహేంద్రవరం, (శుభోదయం న్యూస్): ఇష్టాన్ని సేవా రూపంలో చూపిస్తే సమాజం ఉన్నతంగా ఉంటుందని, సినీ అభిమానం సేవ రూపంలో చూపించడం ఎంతో మంచి పరిణామమని మెగా కుటుంబ అభిమాని పడాల శ్రీనివాసు క్రమం తప్పకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ చిరంజీవి అభిమానులు గర్వపడేలా చేస్తున్నాడని మంత్రి కందులు దుర్గేష్ అన్నారు. ఆగష్టు 22 వ తేదీ మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు పురస్కరించుకుని సామాజిక సేవకుడు, చిరంజీవి బస్టాండ్ వ్యవస్థాపకులు పడాల శ్రీనివాసు ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమం తిలక్ రోడ్ లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కందులు దుర్గేష్ పాల్గొని వీల్ చైర్లు, చెవిటి మిషనులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పడాల శ్రీనివాసు సేవలు కొనియాడారు. చిరుద్యోగి అయినా ఎంతో విశాల హృదయంతో తన వంతుగా సమాచారం చేయడం ఆదర్శనీయమన్నారు, కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎర్ర వేణుగోపాల్ రాయుడు మాట్లాడుతూ ఇలానే ప్రతి సినీ హీరో అభిమాని తన ఇష్టాన్ని సేవా రూపంలో చూపిస్తే సమాజం ఉన్నతంగా ఉంటుందన్నారు. వారోత్సవాలు సందర్భంగా ప్రకృతి పరిరక్షణకై మొక్కలు నాటే కార్యక్రమం, విద్యార్థులకు వితరణ కార్యక్రమాలు అన్న దానాలు, స్వచ్ఛభారత్ లో భాగంగా గోదావరి నది ప్రక్షాళన ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో చిరుకూరి వీర్రాజు, జనసేన నాయకులు చిక్కాల బాబులు, ఆనంద్, యడ్ల మహేష్, మర్సే శ్రీను, సుమ, భవాని, లక్ష్మి, గౌరీ, వేమగిరి నుంచి ప్రకాష్ లైటింగ్ నాగేశ్వరరావు, బిజెపి నాయకులు నిడదవోలు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు దేసినీడి రాంబాబు, పడాల యశోదా కృష్ణ ఫ్రెండ్ సర్కిల్ యువత, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతులను అవలంబించాలి

### ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం



రాజానగరం, (శుభోదయం న్యూస్): రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో గల ఓం శివ శక్తి పీఠం కళ్యాణ మండపం నందు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ మరియు ఉద్యాన శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా రాజం నగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ సతీమణి, జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ వెంకటలక్ష్మి హాజరయ్యారు. రైతులకు పామ్ ఆయిల్ మొక్కలను అందజేశారు.రైతులు పంట సాగు చేయడానికి ఆధునిక యంత్రాలు మరియు పరికరాల పట్ల అవగాహన కల్పించేందుకు పరికరాలు, యంత్రాలు ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల సాగులో కాలానుగుణంగా ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ ఆధునిక పరికరాల ద్వారా అధిక దిగుబడిని పొందాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలో ఆయిల్ పామ్ తోటల రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతులు సమస్యలు త్వరలోనే తీరేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ సభ్యులు కావూరి సురేష్ కుమార్ పుట్టిన రోజు వేడుకలు

### గుడ్ కేర్ హెూమ్ లో భోజనాలు, ఫలములు, స్నాక్స్ వితరణ



రాజమహేంద్రవరం, (శుభోదయం న్యూస్): రాజమండ్రికి చెందిన గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, న్యాయవాదియైన కావూరి సురేష్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా గుడ్ కేర్ హెూమ్ వృద్ధాశ్రమంలో ఆశ్రమ అధినేత కావూరి వరలక్ష్మి నేతృత్వంలో ఆశ్రమ నివాసులకు భోజనాలు, రకరకాలైన స్నాక్స్, ఫలములు వితరణ చేశారు. ఈ సందర్భంగా కావూరి వరలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పేదల ఆశ్రమంలో జరుపుకోవడం మహానందమని, అనేకులకు మార్గదర్శకం కావడం భాగ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావూరి వరలక్ష్మి ఆశ్రమ సిబ్బంది కృప, ఆశ్రమ నివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐ భీమా నాయక్ కు శుభాకాంక్షలు తెలిపిన పందిటి హరీష్, డివి మనోహర్



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన భీమా నాయక్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ పామూరు నాయకులు, పట్టణ ఫోర్ మెన్ కమిటీ సభ్యులు మందిటి హరీష్, పామూరు మాజీ సర్పంచ్ సూర్యచంద్ర సేవా సంస్థ అధ్యక్షులు డివి మనోహర్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. సీఐకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో సోమిశెట్టి లక్ష్మీనారాయణ, సోమిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న యారవ, బొల్లా, పిడుగు





ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని తిరగలిదిన్నె గ్రామంలో అభిరామ్ హెూటల్స్ అధినేత పచ్చిపులుసు శ్రీరాములు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మితమైన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అమీర్ బాబు, కోటిరెడ్డి,హుస్సేన్ రావు యాదవ్,వాయినేని రాఘవ, ఆవుల రవణమ్మ, కావిటి సుబ్బయ్య, మండ్ల మల్లికార్జున, స్వయంకృషి నాయిబ్ రసూల్, సరాబు చంద్ర, పలువురు పామూరు ఆర్యవైశ్య ప్రముఖులు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.



## పర్యాటకపరంగా మరింత అభివృద్ధి : కలెక్టర్ ప్రశాంతి

### పొట్టిలంక నుంచి కడియపు లంక వరకూ బోటు విహారం



రాజమహేంద్రవరం, (శుభోదయం న్యూస్): జిల్లాలో ఇకో టూరిజం అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పొట్టిలంక గ్రామం నుంచి కడుపు లంక కడియపులంక వరకు కెనాల్ లో బోటింగ్ విహారం చేసే విధానం లో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం ఉదయం పర్యాటకశాఖ అధికారులతో కలిసి కడియం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి జిల్లా పర్యటక అధికారులకు సూచనలు చేస్తూ తూర్పుగోదావరి జిల్లాలో పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ తగిన ప్రతిపాదనలను అందజేయాలన్నారు. అందులో భాగంగా ఈకో టూరిజం పై రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి ఇటీవల కడియపు నర్సరీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించామన్నారు. మరింత మంది పర్యాటకులను ఆకర్షించే రీతిలో బోటింగ్ కార్యకలాపాలను చేపట్టాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా పొట్టిలంక గ్రామం నుంచి కడియపులంక గ్రామం వరకు కెనాల్ లో బోటింగ్ కు అనుగుణంగా ప్రతిపాదనలను, డిపిఆర్ ను సిద్ధం చేయాలని ఆదేశించారు. 2027 లో జరిగే గోదావరి పుష్కరాలకు ముందుగానే ఈ ప్రాంతంలో పర్యాటకపరంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. పబ్లిక్ ప్రవేటు భాగస్వామ్యం తో ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. అందులో భాగంగా సుందరీకరణ, గ్రీనరీ, ఆర్చింగ్ పాయింట్స్, రెస్టారెంట్ తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట పర్యాటక శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి. స్వామి నాయుడు జిల్లా టూరిజం అధికారి పి. వెంకటాచలం, తహసిల్దార్ కె. పోసి బాబు, ఎంపిడిఓ కె. రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.


## 350 కేజీల గంజాయి పట్టివేత




మోతుగూడెం, (శుభోదయం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వ 100 రోజుల గంజాయి నిర్మూలన ప్రణాళికలో భాగంగా, ఏఎస్ఆర్ ఎస్పీ అమిత్ బర్దర్ మార్గదర్శకత్వంలో మోతుగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది, మోతుగూడెం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్ పోస్టులో వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా టీఎస్ 09యుఎ 3969 రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన వాహనాన్ని అడ్డుకొని, 350 కిలోల ఎండుగంజాయి మరియు 100 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన అంసారాలి రోనాకలి సయ్యద్ మరియు యూనస్ ముస్తాఫ షేక్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరు మోతుగూడెం నుంచి లాతూర్, మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి కుర్మనూరు గ్రామం, ఒడిశా ప్రాంతానికి చెందిన చక్ రెడ్డిలి నుంచి కొనుగోలు చేసినట్టు గుర్తించారు. ఈ కేసులో ఇంకా ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొత్తం విలువ సుమారు రూ.17,60,000 గా అంచనా వేయబడింది. ఈ 100 రోజుల గంజాయి నిర్మూలన ప్రణాళిక 1వ జూన్ నుండి ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం 16 కేసులు నమోదు చేయబడగా, 43 మందిని అరెస్ట్ చేసి 1,670 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా మాట్లాడుతూ చెక్ పోస్టులను మరింత పటిష్టం చేయడం, ముఖ్య కూడళ్ళ వద్ద సీసీటీవీ కెమెరాలను అమర్చడం, అవసరమైతే రాష్ట్ర పోలీసుల సహాయంతో పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చింతూరు సీఐ ఎం. గజేంద్ర కుమార్ మరియు మోతుగూడెం ఎస్ఐ జి. గోపాల రావు పాల్గొన్నారు.

## అంగన్వాడీలను రాజకీయకోణంలో చూడవద్దు

### ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి






కావలి,(శుభోదయం న్యూస్ ): బోగోలు మండలంలోని మండలపరిషత్ అభివృద్ధికార్యాలయం సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ అధ్యక్షురాలు మేకల సుజాత అధ్యక్షతన నిర్వహించిన సాధారణసర్వసభ్యసమావేశానికి కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిచారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేది తల్లిఅయితే, జ్ఞానాన్ని బోధించేదిఅంగనవాడిలని, ఎక్కడో ఎవరో ఒకకార్యకర్త తప్పు చేసిందని అంగన్వాడీకేంద్రాలను రాజకీయకోణంలో చూడకుండా గ్రామీణ ప్రాంతాలలోని అంగనవాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నాడు. జిల్లాలో వ్యవసాయఉత్పత్తులుఅధికంగా పండించేనియోజకవర్గం కావలిఅని నియోజకవర్గంలోని రైతులందరికీ సాగునీరు అందించేదిశగా కావలి కాలువలో పూడికతీయించేందుకు ఐదుకోట్ల 25 లక్షలతో అంచనాలు తయారుచేయించామన్నారు. రైతులు,అధికారుల సమన్వయంతో ప్రతిచెరువుకు తాగునీరు,సాగునీరు అందిస్తామన్నారు. త్వరలోనే బిట్రగుంటకు ప్రధానసమస్య అయిన ఫ్లైఓవర్, అండర్ పాస్ పనులుమొదలుపెట్టి పూర్తిచేస్తా మన్నారు. మండలంలోఉన్న అందరూ సర్పంచులు,క్ష ఎంపీటీసీలు ప్రభుత్వానికి సహకరిస్తే వారిగౌరవానికిఎలాంటి భంగం వాటిల్లకుండా గ్రామాలను అభివృద్ధిచేసుకుందామని పిలుపునిచ్చాడు. పైకార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, కావలివ్యవసాయసహాయ సంచాలకుడు నాగరాజు ,మండల పరిషత్ అభివృద్ధిఅధికారి వెంకట సుబ్బారావు, తాసిల్దార్ మలిశెట్టి సురేష్ బాబు, బిట్రగుంటఎస్సై భోజ్యానాయక్, కార్యాలయ కార్యనిర్వాహణాధికారి గోవిందరావు, మండలంలోని సర్పంచులు,ఎంపీటీసీలు అన్ని శాఖలఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు




దోమ, (శుభోదయం న్యూస్ ):మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాండు, ఉపాధ్యాయుల బృందం, ఏఏపీసీ చైర్మన్ రేణమ్మ,అంగన్వాడి టీచర్స్,ఆయలు,విద్యార్థినిలు,విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కార్మికుల గౌరవ వేతనం పెంచాలి

### పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం, (శుభోదయం న్యూస్): ఆంధ్రా పేపర్ లిమిటెడ్, రాజమహేంద్రవరంలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి తగిన ప్రతిపాదన పంపడం జరుగుతుందని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లో పేపర్ యూనియన్ యాజమాన్యాల 10 యూనియన్ల ప్రతినిధులు ఆంధ్ర పేపర్ మిల్ యాజమాన్యం ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి , ఎస్పి నరసింహ కిషోర్ లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కన్నీరు దుర్గేష్ కందుల దుర్గేష్, ఎంపీ పురందరేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అధికారులు , పది యూనియన్ లకి చెందిన నాయకులు, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ లేబర్ ఏ రాణి, డిసిఎల్ కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందులు దుర్గేష్ మాట్లాడుతూ, పేపర్ మిల్ యూనియన్ నాయకులతోనూ కంపెనీ యాజమాన్యం తోనూ విస్తృత చర్చల అనంతరం గౌరవ వేతనం పెంచాలని కార్మికులు ప్రతిపాదించిన ప్రతిపాదనను పరిగణన లోనికి తీసుకొవాలని స్పష్టం చేశామన్నారు. తదుపరి బోర్డు సమావేశంలో తమ డైరెక్టర్ల బోర్డుకు వివరించి ఆమేరకు ముందుకు రావడం జరుగుతుందని పేర్కొన్నారు. సమస్యలు లేని ఏపిపిఎంబిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ, 2. ఎపిపి ఎం మల్టీపర్పస్ ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ల కార్యకలాపాలు కొనసాగించాలన్న కార్మికుల డిమాండు సానుకూలంగా స్పందించాలని ఎంపి దగ్గుబాటి పురందరేశ్వరి సూచించారు. ఈ సందర్భంగా ఇరువురికి ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలను కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ పి ప్రశాంతి ప్రతిపాదించడం జరిగింది. ఈ నేపథ్యంలో 01.07.2020 నుండి 31.12.2023 వరకు వేతన పెంపుదల గురించి మంచి ప్రతిపాదనతో రావాలని మేనేజ్‌మెంట్ ప్రతినిధులకు సూచించారు.

# వసతి గృహాలకు మోక్షం ఎప్పుడో...

### ఎదురుచూస్తున్న పేద విద్యార్థులు





తనకల్లు, (శుభోదయం న్యూస్): తనకల్లు మండల కేంద్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్ లు చాలా కాలంగా మూతపడి ఉండటంతో హాస్టల్ల నిండా చెట్లు పొదల రూపంలో విపరీతంగా పెరిగిపోయాయి. హాస్టల్ బిల్డింగులు మొత్తం పనికి రాకుండా రోజురోజుకీ పాడైపోతున్నాయి అప్పట్లోనే లక్షలు ఖర్చు చేసి ప్రభుత్వం నిర్మించిన బాలల వసతి గృహాలు ఇప్పుడు ఎందుకూ పనికి రాకుండా విపరీతమైన చెట్లు పెరిగి నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఒకప్పుడు తనకల్లులోని ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్ల లో మండల కేంద్రంలోని చుట్టూ ఉన్న గ్రామాల నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి ఈ హాస్టల్లోనే ఉంటూ తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ఇప్పుడు అనేక రంగాల్లో వివిధ హోదాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఎంతోమందిని ఉన్నత స్థానాలకు ఎదగడానికి ఉపయోగపడిన ఈ హాస్టలు ఇప్పుడు మూలనపడ్డాయి. ఈ మూడు హాస్టల్లు విద్యార్థులతో నిండి ఉండి నిత్యం కళకళలాడుతూ ఉండేవి. చుట్టుపక్కల గ్రామాల నుండి




హాస్టల్లు అనుకూలంగా ఉన్నందున ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరుగుతూ ఉండేది అప్పుడు హాస్టల్లో విద్యార్థులు ఉండటం చేత హాస్టల్లో ఉండే విద్యార్థులతో కలిపి ఉన్నత పాఠశాలలో 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. ఈ హాస్టల్లు మూత పడిపోవడంతో గ్రామీణ ప్రాంతాల వారికి అనుకూలంగా లేకపోవడం చేత గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ దూరప్రాంతాలకు హాస్టల్లు ఉండే ప్రదేశాలకు వెళ్లి చదువులు కొనసాగిస్తుండడంతో తనకల్లు ఉన్నత పాఠశాలలో 1000 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇప్పుడు 3 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు నిర్వహిస్తూ ఉన్నా కూడా మొత్తం విద్యార్థులు 400 మందికి దాటలేదు. అంత దారుణంగా విద్యార్థుల శాతం పడిపోయింది. విద్యార్థుల శాతం పడిపోవడంతో ఇక్కడ ఉన్న టీచర్లను కూడా వేరే వేరే ప్రదేశాలకు బదిలీలు చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే ముందు ముందుకు విద్యార్థులు ఇంకా తగ్గిపోతారు. కనుక ప్రభుత్వం స్పందించి మూతపడిన హాస్టల్ లను మరల వెంటనే పునఃప్రారంభించేలా చర్యలు తీసుకొని గ్రామీణ ప్రాంతాలలోని పేదవారు బడుగు బలహీన వర్గాల పిల్లలను ఆదుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఫార్మా ఇండస్ట్రీ కంపెనీలు కార్మికుల ప్రాణాలతో చెలగాటం

### చుట్టుపక్క గ్రామాల వారు అరచేతిలో ప్రాణాలు




విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో (శుభోదయం న్యూస్): పరవాడ జవహర్లాల్ ఫార్మాసిటీలో సెనర్జిన్ యాక్టివ్ ఇంగ్రిడియంట్స్ యూనిట్ 3 ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు సంఘటన జరిగి విషయం అందరికీ తెలుసు కానీ ఫార్మా ఇండస్ట్రీ కంపెనీ వారు డెడ్ బాడీని ఠాగూర్ సినిమా లాగా ఆరా తీసుకొచ్చారు చనిపోయిన బాడీని తెలివిగా బతికున్నట్టు వ్యవహరించారు గుట్టుచప్పుడు కాకుండా ప్రజలు ఎవరికి తెలియకుండా ప్రెస్ వారికి కూడా బయటికి సోకకుండా పక్క ప్లాన్ ప్రకారం మెల్లిమెల్లిగా హాస్పిటల్ కి తరలించారు ఈ విషయం కొద్దిసేపటికి వెలుగులోకి వచ్చింది అయితే ఝర?ండ్ చెందిన ఒక వ్యక్తి ఆయన పేరు రొయ్య ఆర్జీ అనే ఆ స్వామి రియాక్టర్ పేలిన వెంటనే చనిపోయాడు కానీ తెలివిగా ఈ



ఫార్మా ఇండస్ట్రీ వాళ్ళు కట్టు కథలు విరజెల్లారు ఎక్కడైతే ఈ విషయం ప్రజలకు తెలిస్తే ప్రజలందరూ కంపెనీ మీద పడతారని గందరగోళం అవుతుందని తెలివిగా తప్పించుకున్నారు ఎంప్లాయిస్ కార్మికులు ఫార్మాసిటీ కి వెళ్లాలంటే భయం ఏర్పడుతుంది బతుకు బాగుండలేక ఊరి కాని ఊరు వచ్చిన ఎంతమందో అమాయకుల్ని ఈ ఫార్మా ఇండస్ట్రీ బలి తీసుకుంటుంది కంపెనీలకి వెళ్లాలంటే భయం .ఏ క్షణంలో ఏం జరుగుతుందని అని ప్రజల గుండెల్లో ఆందోళన చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఎంతో భయంతో ఉనికి పోతున్నారు ఈ ఇండస్ట్రీని ఎక్కడో దూర ప్రదేశంలో ఉంచాలని ప్రజలందరూ గగ్గోలు పెడుతున్నారు నాయకులకి కావలసింది ముడుపులే తప్ప ప్రజల గోస వినిపించదా అని తీవ్రంగా మండిపడుతున్నారు చుట్టుపక్క ప్రజలు ఊరు మధ్యలో ఇలాంటి కంపెనీలు ఏంటి మా ప్రాణాల్ని బలి తీసుకుంటారా అని కంటతడి పెట్టుకుంటున్నారు ఫార్మా ఇండస్ట్రీలో పనిచేస్తున్న వారి ఫ్యామిలీలు ఎలా బతకాలని డబ్బులు ఇస్తే ప్రాణం తిరిగి వస్తుందా ఒక ప్రాణం ఖరీదు డబ్బుతో కొంటారా ఏంటి సమాజం అని వారి యొక్క కుటుంబాలు బాధ దుఃఖంతో విఫలమైపోతున్నారు చిన్నపిల్లలు ఉన్న వారు కూడా వాళ్ళ నాన్న గురించి వాళ్ళ అమ్మ గురించి ఎంతో ఆస్తో ఎదురుచూస్తూ ఏడుస్తున్నారు కనీసం ఆ చిన్నపిల్లల గురించి కూడా పట్టించుకోలేని అధికారులు పట్టుకొమ్ములాగా కంపెనీ వారికే కొమ్ము కాస్తుంటే మా బాధ ఎవరితో చెప్పుకోవాలి అని కుటుంబీకులు గుల్లునుమని ఏడుస్తున్నారు అధికారులకి ఈ రాజకీయ నాయకులకి ఎప్పుడు ఈ గుండె కలుగుతుంది రాజకీయ నాయకులు కార్ల తిరగడం తప్ప ఓట్లు వేసేటప్పుడు ఒక మాట వేయించుకున్నప్పుడు ఒక మాట ఇప్పిన రాజకీయ నాయకులు అలాగే వీలు చెప్పుచేతలో ఉంటున్న అధికారులు మన భారతదేశం ఇలా అయిపోయిందా బ్రిటిష్ బానిస బతుకులు మన చరిత్ర ఏది ఎక్కడుంది మనకి స్వతంత్రం తెచ్చిన మహానుభావులు మనకిచ్చిన స్వతంత్రం ఇదేనా ఇలాంటి చీడపురుగుల కోసమా ఇప్పుడు మారుతుంది సమాజం అడిగేవాడు లేడు ప్రశ్నించే వాడే లేడు కథనాలు కథనాలు రాసిన ఎవ్వరు కూడా లెక్కచేయడం లేదు అంతా డబ్బు డబ్బుతో ఏ పని అయినా చేయొచ్చు మనిషి ప్రాణం తీయాలి అన్న మనిషి ప్రాణం తీయాలి అన్న డబ్బు చచ్చేటప్పుడు ఏం మోసపోతాం. మారంద్రా ప్రజల ప్రాణాలు కాపాడండి అని ప్రజలు ప్రజా సంఘాల నిలదీస్తున్నారు.

## బంగ్లాదేశ్ హిందు ఉపాధ్యాయులపై జరిగిన దాడులపై టిపియుస్ నిరసన..




రేగొండ, (శుభోదయం న్యూస్): బంగ్లాదేశ్ లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటికి హిందువులపై దాడులను కండిస్తున్నట్టు టిపియుస్ జిల్లా అధ్యక్షులు ములుకల్ల తిరుపతి తెలిపారు.టీపియుఎస్ రేగొండ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తమ నిరసనను తెలియచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు ఉద్యోగ,ఉపాధ్యాయులపై దాడులు చేస్తూ, మూకుమ్మడిగా బలవంతంగా రాజీనామాలు చేపిస్తున్నారని ఇలాంటి అకృత్యాలను అక్కడి తాత్కాలిక ప్రభుత్వం వెంటనే అరికట్టి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘము తరుపున డిమాండ్ చేశారు.అదే విదంగా పశ్చిమ బెంగాల్ లో జూనియర్ డాక్టర్ పై అత్యాచారం కు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాంటి నీచపు ఘటనలు దేశంలో మరెక్కడా పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పడిదల భాస్కర్ రావు, జిల్లా,మండల తపస్ నాయకులు విజయ్ కుమార్,బాపురెడ్డి,మనోహర్,లక్ష్మయ్య, స్వప్న, శ్రీలత ,సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు నేలమట్టం



టేక్మాల్, (శుభోదయం న్యూస్): టేక్మాల్ మండల కేంద్రంలోని టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమంలో గ్రామ పంచాయతీ లో నాటిన మొక్కలను నాటి చెట్టుగా పెంచితే పంచాయతీ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా శనివారం విద్యుత్ వైర్లకు కోమ్మలు తకుతున్నాయని కోమ్మలను నరకాల్సిన పోయి చెట్లను విద్యుత్ శాఖ అధికారులు నరికి వేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని పిలుపునిస్తుంటే, విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వృక్షాలను నరికి వేసిన విద్యుత్ శాఖ అధికారులపై సంభందిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## కుందనపల్లి గ్రామంలో అకాడమిక్ బ్లాక్ ఇంటర్మీడియట్ బిల్డింగ్ ను ప్రారంభించిన రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్





రామగుండం, ఆగస్టు24, (శుభోదయం న్యూస్): అంతర్గాం మండలం కుందన పల్లి గ్రామంలో ప్రభుత్వ కస్తూరిబా ఎస్ ఎస్ ఏ నిధుల నుండి ఇంటర్మీడియట్ అకాడమిక్ బ్లాక్ బిల్డింగును 2.05 కోట్లతో ప్రారంభించిన మాన్యశ్రీ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారు విద్యార్థులను పలకరించి పలు విషయాలపై ఆరా తీయడం జరిగినది. వసతి గృహంలో అందే సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడితే నాకు తెలియజేయండి అని ఉదయం టిఫిన్ మధ్యాహ్నం లంచ్ సాయంత్రం డిన్నర్ పెడుతున్నారా లేదా అని అడుగుతూ వారానికి నాలుగు రోజులు ఎగ్గు అందిస్తున్నారా లేదా ప్రతి సండే పండ్లు అందిస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీస్తూ హాస్టల్లో ఉండే విద్యార్థులకు అందే పలు సౌకర్యాలు తప్పకుండా అందజేయాలని సదరు వార్డెన్ గారికి ఆదేశాలు జారీ చేయడమైనది. విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని హాస్టల్లో ఉండే విద్యార్థులు చదువుకోవాలని ఆలోచనతో తల్లితండ్రులకు దూరంగా ఉంటూ ఇక్కడ చదువుకుంటున్నారని వారికి తగిన సౌకర్యాలు సమకూర్చే బాధ్యత మనదేనని ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ గారితో మాట్లాడుతూ విద్యార్థులందరినీ ఉత్సాహపరిచారు ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు అంతర్గాం మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షుల తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామగుండం జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న...

### ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ



రామగుండం, ఆగస్టు24, (శుభోదయం న్యూస్): గోదావరిఖని పట్టణంలోని రామగుండం వైద్య కళాశాల,జనరల్ ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రస్తుత ఆసుపత్రికి ఉన్న అవసరాలు మొదలగు అంశాలను జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమ బిందూ సింగ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో రోగులకు అందించే నాణ్యమైన వైద్యంతో పాటు వారితో సిబ్బంది ప్రవర్తన తీరు కూడా ముఖ్యమని




అన్నారు. పారిశుధ్య అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, దానికి అనుగుణంగా ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రామగుండం జనరల్ ఆసుపత్రి సందర్శించారు. ఆపరేషన్ థియేటర్ రీన్నోవేషన్ , లేబర్ రూమ్ విస్తరణ, పేమెంట్ రూం ల విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్ సింగ్, ప్రజాప్రతినిధులు సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జనరల్ ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, లాజిస్టిక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆసుపత్రి ద్వారా ప్రజలకు వైద్య సేవలు మరింత మెరుగ్గా అందే దిశగా వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ చాలా వరకు మెరుగు కావాల్సిన అవసరం ఉందని, పారిశుధ్య కాంట్రాక్టర్ ను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మేర పారిశుధ్య కార్మికులతో ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యంలో గణనీయమైన మార్పు రాని పక్షంలో అవసరమైతే కాంట్రాక్టర్ ను కూడా రద్దు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో కిందిస్థాయి సిబ్బంది ప్రవర్తించే తీరును నిరంతరం పర్యవేక్షించాలని, రోగులతో, వారి సహాయకులతో సిబ్బంది ఓపికతో ఉండే విధంగా చూడాలని అన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల పనితీరును ప్రతి వారం రివ్యూ చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో ఆర్.ఎం.ఓ లకు ప్రత్యేక విధులను కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. రామగుండం వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఎట్టి పరిస్థితుల్లో జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం మెడికల్ కళాశాలకు అనుసంధానంగా నిర్మిస్తున్న 355 పడకల ఆసుపత్రి నిర్మాణ భవనం సకాలంలో పూర్తి చేయాలని, వచ్చే జులై నాటికి ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు.


## రామగుండం శాసన సభ్యుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ను కలిసిన గురుకుల పేరెంట్స్ కమిటీ నాయకులు



గోదావరిఖని టౌన్, ఆగస్టు24, (శుభోదయం న్యూస్): గోదావరిఖనిలోని రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాంపల్లి సతీష్, వైస్ చైర్మన్ బాదె క్రాంతి, ప్రధాన కార్యదర్శి దుర్గం మురళీధర్, సెక్రటరీ సంకె సతీష్, ట్రెజరర్ రాజేశ్వర్ రావు రామగుండం శాసన సభ్యుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను శనివారం కలిశారు. రామగుండం ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నందుకు ఎమ్మెల్యేకు పేరెంట్స్ కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన సమస్యగా ఉన్న గురుకుల కళాశాల రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, స్వయంగా సందర్శించి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, గురుకులలో నాణ్యమైన విద్య అందించాలని, పరిసరాలను పరిశుభ్రం చేయించాలని, నాణ్యమైన ఆహారం అందించేలా చూడాలని ఎమ్మెల్యేను పేరెంట్స్ కమిటీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాంపల్లి సతీష్‌తోపాటు వైస్ చైర్మన్ బాదె క్రాంతి, ప్రధాన కార్యదర్శి దుర్గం మురళీధర్, సెక్రటరీ సంకె సతీష్, ట్రెజరర్ రాజేశ్వర్ రావు, జాయింట్ సెక్రటరీ స్వాతి, అడ్వైజర్స్ భాగ్యలక్ష్మి, పల్లె శ్రీనివాస్, దుబ్బయ్య, శంకర్, మంగ, తిరుమల, నిర్మల తదితరులున్నారు.

## తక్కలపల్లి గ్రామంలో పాఠశాల గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్





రామగుండం, ఆగస్టు24,(శుభోదయం న్యూస్) : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. శనివారం పాలకుర్తి మండలం తక్కలపల్లి లోని జిల్లా పరిషత్ పాఠశాల లో 46.5 లక్షలతో ఎస్ ఎస్ ఏ ఎడ్యుకేషనల్ నిధుల నుండి నిర్మించిన



పాఠశాల గదులను ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి డిఎంకి వినతి పత్రం ఇచ్చిన స్పందించని ఆర్టీసీ డిఎం

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు




కామారెడ్డి జిల్లా, (శుభోదయం న్యూస్ ): బీబీపేట్ మండల కేంద్రంలో శనివారం విద్యార్థులు బీబీపేట్ స్ట్రీట్ లైట్ వద్ద బస్సులను నిలిపి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మాకు సరైన సమయంలో బస్సులు రాకపోవడం వల్ల మేము కళాశాలకు లేటుగా వెళ్లడం వల్ల క్లాసులు మిస్ అవుతున్నామని అందుకే ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించమని అన్నారు. ఎన్నిసార్లు డిపో మేనేజర్ కి చెప్పినా కూడా మమ్మల్ని పట్టించుకోవడంలేదని, ఇలా అయితే మా చదువులకు ఆటంకం కలుగుతుందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ధర్నా నిర్వహించామన్నారు. ఉదయం 7 గంటల నుండి7:30 వరకు మాకు బస్సు వచ్చే విధంగా ఆర్టీసీ డిపో మేనేజర్స్ స్పందించాలని వారు పేర్కొన్నారు. కామారెడ్డి ఆర్టీసీ డిఎంకు ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చిన చూసి చూడనట్టుగా వ్యవహరిస్తుందని, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు సమయానికి రావడం లేదని విద్యార్థుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం మొత్తానికే బస్సులు లేవు. కావున మాకు బస్సు కావాలి అని కోరుకుంటున్నాము. ఇంటర్ విద్యార్థులకు చాలా ఇబ్బంది అవ్వుతుంది. బస్సు



లేక చాలా కష్టం అవుతుంది. కావున మళ్ళీ యధావిధిగా మాకు ఉదయం శెట్టల్ గా ఇస్సనగర్ మరియు మల్కాపూర్ బస్సు కావాలి అని కోరుకుంటున్నారు.

## హైదరాబాద్ ఏమ్మెల్సీ యమ్.యస్ ప్రభాకర్ రావు కుమారుడి వివాహంలో పాల్గొన్న కర్క నాగరాజు



హైదరాబాద్, (శుభోదయం న్యూస్): నగరంలో అతిధి కన్వెన్షన్ హాల్ లో జరిగిన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మాజీ విప్, హైదరాబాద్ ఏమ్మెల్సీ యమ్.యస్ ప్రభాకర్ రావు గారి కుమారుడు అభిషేక్ రావు వివాహానికి టీపీసీసీ ప్రధానకార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ శ్రీమతి పి.విజయారెడ్డితో కలిసి వివాహ కార్యక్రమంలో పాల్గొన్న కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కర్కనాగరాజు. అనంతరం నూతన వదువు వరుడిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సదామహేష్, కర్కమహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కుచట్టంపై అవగాహన సదస్సు



బాన్సువాడ(శుభోదయం న్యూస్ ):-పట్టణంలోని సాయికీర్తి జూనియర్ కళాశాలలో శనివారం సమాచార హక్కుచట్టం 2005 మరియు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్



గంగరాజు అధ్యక్షతన వహించగా, ముఖ్యఅతిథిగా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ మాజీ న్యాయమూర్తి ఏం.ఏ. సలీం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు క్రిమినల్ కొత్త చట్టాల గురించి విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. అలాగే బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ వడ్ల శివరాం, శ్రీను సమాచార హక్కు చట్టం 2005 గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగరాజు, అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గవర్నర్ ను కలిసిన ఖమ్మం ఎంపీ

### జిల్లా పర్యటనకు రావాల్సిందిగా కోరిన రఘురాం రెడ్డి, మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి



ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, (శుభోదయం న్యూస్): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి శనివారం హైదరాబాద్ లోని రాజ్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. తన తండ్రి, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి తో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా.. ఆధ్యాత్మికం, పర్యాటకంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఇటు ఖమ్మం ఖిల్లా, దక్షిణ ఆసియాలోనే పెద్దదైన బౌద్ధ స్థూపం, కూసుమంచి లో కాకతీయులు నిర్మించిన శైవాలయం.. అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శ్రీ సీతారామ స్వామి దేవస్థానంతో పాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సింగరేణి, పలు కేంద్రీయ పరిశ్రమలు, ప్రాజెక్టులు, అటవీ సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. తమరు రాష్ట్ర గవర్నర్ గా.. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వస్తే.. మరింత ప్రాచుర్యం లభిస్తుందని, వీలైనంత త్వరగా రావాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ స్పందిస్తూ.. తప్పకుండా వీలైనంత త్వరలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వస్తానని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డికి మాటిచ్చారు. ఎంపీ స్పందిస్తూ.. గవర్నర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## పులిచింత ముంపు బాధితులకు ఇంటి పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం,(శుభోదయం న్యూస్):సత్తెనపల్లినియోజకవర్గం,రాజుపాలెం మండలంలోఇళ్ల పట్టాల



పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి శాసనసభ్యుడు,మాజీ మంత్రి కన్నాలక్ష్మీ నారాయణ.వివరాల ప్రకారం రాజుపాలెం తహసిల్దార్ కార్యాలయం దగ్గర కేవల్ రావు పులిచింతల ముంపు ప్రాంతాల నివాసితులకు గృహ పట్టాల పంపిణీ పంపిణీ చేశారు.అనంతరం చౌటపాపయపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన సచివాలయాన్ని కన్నా ప్రారంభించినారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న ప్రభుత్వ అధికారులు మరియు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతి విద్యా మందిర్ లో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



తనకల్లు,(శుభోదయం న్యూస్): తనకల్లు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ హైస్కూల్లో శనివారం



ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను కరస్పాండెంట్ నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో శ్రీకృష్ణుని వేషధారణలు వేసి, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఇలాంటి పండగలను పాఠశాలలో విద్యార్థుల తో జరుపుకోవడం వల్ల విద్యార్థులకు మన పండగల సంప్రదాయాలు తెలుస్తాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పీజీ నరేష్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సెయింట్ మార్క్స్ స్కూల్ నందు ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): ఈనెల 26వ తేదీన శ్రీ కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని స్థానిక సెయింట్



మార్క్స్ స్కూల్ నందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముందస్తుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా సెయింట్ మార్క్స్ స్కూల్ అధినేత ఎం జయ కుమార్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీకృష్ణుని జననం జీవితం అనేక కష్టాలతో ప్రారంభమైనదని కానీ ఏనాడు ధర్మాన్ని , మానవత్వాన్ని విడువలేదని ఆయన అన్నారు. శ్రీకృష్ణుని ఆరాధించాలని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మార్క్స్ అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కనిగిరి సర్కిల్ సీఐగా షేక్ ఖాజావలి




కనిగిరి ఆర్సి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్): కనిగిరి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా షేక్ ఖాజావలి శనివారం బాధ్యతలు చేపట్టారు. దిశ పోలీస్ స్టేషన్ సీఐ గా పనిచేస్తున్న అయన బదిలీ పై శనివారం కనిగిరి పట్టణ సీఐగా బాధ్యతలు తీసుకున్నారు .గతంలో నెల్లూరు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లో సీఐ గా పని చేస్తూఎన్నికల సమయంలో నెల్లూరు నుంచి ప్రకాశంజిల్లా దిశ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. ప్రస్తుతం సాధారణ బదిలీలలో భాగంగా ఒంగోలు దిశ పోలీస్ స్టేషన్ నుంచి కనిగిరి సీఐ గా బాధ్యతలు చెప్పటారు.ఈ సందర్బంగా మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలు, జూదం, గంజాయి,అక్రమ మద్యం, సైబర్ నేరాలు,తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## సే నోటు డ్రగ్స్ - డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం పోస్టర్లు విడుదల




తనకల్లు (శుభోదయం న్యూస్): కదిరి టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ ఆయన నివాసంలో సే నో టు డ్రగ్స్-డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం పోస్టర్ను విడుదల చేశారు.

## కదిరి రూరల్ సీఐగా నాగేంద్ర



తనకల్లు, (శుభోదయం న్యూస్): కదిరి రూరల్ సిఐ గా నాగేంద్ర బాధ్యతలు చేపట్టారు బాధ్యతలు చేపట్టిన అనం ఆయనతరం కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## పంచాయతీలు అన్నిటికీ ఉపాధి హామీ పథకం

## 13.326 గ్రామ సభలు ఒకేసారి నిర్వహించిన పవన్ కళ్యాణ్



బాపట్ల పట్టణం, (శుభోదయం న్యూస్) ఆగస్ట్ 24 : బాపట్ల జిల్లా బాపట్ల పట్టణంలోని జనసేన పార్టీ దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు మాట్లాడుతూ ఎ.న్డీ.ఏ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు డిప్యూటీ సీఎం మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు శ్రీ. కొణిదల పవన్ కళ్యాణ్ గారు పిలుపుమేరకు ఈనెల 23వ తారీకు నిన్న నిర్వహించిన రాష్ట్రంలోనే 13.326 గ్రామపంచాయతీలో గ్రామ సభలు ఒకేసారి ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించిన కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు గత 33 సంవత్సరాలు ఎన్నడు ఎప్పుడు ఏర్పాటు చేయని పంచాయతీ గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలు గుర్తించే తట్టు కూటమి ప్రభుత్వంలో ఉన్న పంచాయతీలు అన్నిటికీ ఉపాధి హామీ పథకం రైతు ఉపాధి హామీ మురుగు కాలువలు పంచాయతీ అభివృద్ధి కొరకు తీర్మానాలు చేయటం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలకు మంత్రులకు ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ అధికారులకు రైతులకు ప్రజలకు ప్రత్యేకంగా దివ్యాంగులకు కార్యకర్తలకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆల్ఫా లిటిల్ కింగ్ డమ్ స్కూల్ నందు ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): ఈనెల 26వ తేదీన శ్రీ కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని స్థానిక ఆల్ఫా లిటిల్ కింగ్ డమ్ స్కూల్ నందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముందస్తుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పట్టణ రెండవ ఎంపీటీసీ డాక్టర్ ఆకు పాటి వెంకటేష్ కుమారుడు ఆకుపాటి నోహిత్ శ్రీకృష్ణుని వేషధారణలో అందరిని అలరించాడు. ఈ కార్యక్రమంలో ఆల్ఫా అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జెమిని రెడీమేడ్ షాపును ప్రారంభించిన పువ్వాడి,యారవ, బొల్లా





ప్రకాశం జిల్లా బ్యూరో,, (శుభోదయం న్యూస్ ): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డు నందు బత్తుల ఏడుకొండలు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన జెమినీ రెడీమేడ్ షాపును ప్రారంభించిన పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బత్తుల ఏడుకొండలు నూతనంగా ప్రారంభించిన జెమిని రెడీమేడ్ షాప్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగుతూ దినదిన ప్రవర్ధమానం కావాలని వారు ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పందిటి హరీష్, సయ్యద్ అమీర్ బాబు, పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, కోటిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, సోమిశెట్టి శ్రీనివాసులు, సరాబు చంద్ర పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


## ఢిల్లీ హౌజ్ రెవెన్యూ కోర్టుకి హాజరైన మాజీ విద్యార్థి సంఘం నేతలు

### 2013లో తీహార్ జైలులో 72 రోజులు జైలు జీవితం గడిపిన జర్నలిస్టు




ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, (శుభోదయం న్యూస్): 12 సంవత్సరాల తర్వాత ఢిల్లీ హౌజ్ రెవెన్యూ జిల్లా కోర్టు కేరళ , పశ్చిమ బెంగాల్,ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ కు చెందిన ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ప్రస్తుత ఎంపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ శివదాసన్ తో సహా 10 మంది సుదీర్ఘ కాలం తర్వాత మెజిస్ట్రేట్ ఎదుట హాజరైయ్యారు. 2013 జూన్ 13 న అప్పటి కేరళ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ నేతృత్వం లో జరిగిన సోలార్ పవర్ స్కాం లో జరిగిన అవినీతి అక్రమాల పై విచారణ జరిపించాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసి అక్రమ కేసు నమోదు చేసి 72 రోజులు ఢిల్లీ తీహార్ జైలుకు తరలించారు. తీహార్ జైల్లో తెలంగాణ కు చెందిన పగడాల లక్ష్మయ్య, ప్రస్తుత రైతూ సంఘం రాష్ట్ర సహయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, ఖమ్మం జిల్లా కు చెందిన అప్పటి ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ప్రస్తుత ఓ న్యూస్ ఛానల్ బ్యూరో మందుల ఉపేందర్ కేసు వాయిదా నిమ్మితం ఢిల్లీ హౌజ్ రెవెన్యూ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరైయ్యారు. దేశ ద్రోహులుగా,అవినీతి,అక్రమాలు, చేసిన ముద్దాయిలు లాగా విద్యార్థి సంఘం నాయకులను ట్రీట్ చెయ్యడం జైలు, కోర్టు కు తరలించడం పై పలువురు అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. మొక్కోవనే దీక్ష తో ఉద్యమ స్ఫూర్తి నీ కనబరుస్తున్న ఉద్యమ నాయకులు ఉపేందర్, శోభన్ పలువురు అభినందిస్తున్నారు.

## సిఐ భీమా నాయక్ కు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన భీమా నాయక్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, లక్ష్మీ నరసాపురం ఎంపిటిసి బొల్లా నరసింహారావు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. సీఐకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో బిల్డర్ పువ్వాడి వెంకటేశ్వర్లు, డివి మనోహర్, పందిటి హరీష్, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, సోమిశెట్టి శ్రీనివాసులు, స్వయంకృషి నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో జరిగిన ఘటన దురదృష్టకరం

### బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు




బాపట్ల పట్టణం, (శుభోదయం న్యూస్) ఆగస్టు 24 : బాపట్ల జిల్లా సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో ప్రయోగం వికటించి విషవాయువు వెలువడి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సమాచారాన్ని తెలుసుకున్న వెంటనే బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ స్పందించారుజిల్లా కలెక్టర్ వెంకట్ మురళి గారికి జెసి సుబ్బారావు గారికి ఫోన్ చేసి ప్రాంతీయ వైద్యశాలలో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థులకు సత్వర వైద్యం అందించి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ సిద్ధార్థ ను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆదేశించారు విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.

# కన్ఫాడరేషన్ అఫ్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ విజయవాడలో సౌత్ కాన్ 2024 నిర్వహించడం జరిగింది




విజయవాడ (శుభోదయం న్యూస్ )సెంట్రల్ రిపోర్టర్ : కంకిపాడులోని అయన కన్వెన్షన్ సెంటర్లో కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఆంధ్రప్రదేశ్ 2024 ఆగస్టు 24 మరియు 25 తేదీల్లో విజయవాడలో 'సౌత్ కాన్ 2024'ని నిర్వహించడం జరిగినది.మంత్రి పొంగురు నారాయణ, బోండా ఉమామహేశ్వరరావు, పాల్గొనడం జరిగినది. భారతదేశంలోని రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంఘాల సమాఖ్య ఇది రియల్ ఎస్టేట్ రంగంలోని వివిధ అంశాలపై ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతుంది. క్రెడాయ్ భారతదేశంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి కృషి చేస్తుంది అని, దక్షిణ భారతదేశంలోని నిర్మాణం మరియు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై సవివరమైన నివేదికను విడుదల చేసి,జె ఎల్ ఎల్ ద్వారా ఐదు దక్షిణ భారత రాష్ట్రాల నుండి దాదాపు 700 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు అని, క్రెడాయ్ ట్రిచీ చాప్టర్ ఫెయిర్ప్రో 2024 అని పిలువబడే మూడు రోజుల ప్రాపర్టీ ఎగ్జిబిషన్ను నిర్వహించింది, ఇందులో దాదాపు 2,000 రెరా-ఆమోదిత ప్రాజెక్ట్లను ప్రదర్శించింది, ఇందులో 24 మంది నగర ఆధారిత ప్రమోటర్ల నుండి విల్లాలు మరియు అపార్ట్మెంట్లు ఉన్నాయి. ఆగస్టు 9 నుంచి 11 వరకు కలైరంగం కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు ఆస్తులు ఉన్నాయి అని. అర్హులైన కొనుగోలుదారులకు అక్కడికక్కడే హౌసింగ్ లోన్లు అందించేందుకు బ్యాంకులు ముందుకొచ్చాయి అని,ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానిలో గూగుల్ యూట్యూబ్ అకాడమీని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు, తెలియజేసారు అని. అమరావతిలో గూగుల్ యాజమాన్యంలోని యూట్యూబ్ అకాడమీని ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రకటించారు. ఈ చొరవ అల్, కంటెంట్ మరియు స్కిల్ డెవలప్మెంట్ మరియు సర్టిఫికేషన్ ప్రోగ్రామ్లను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది, అదనంగా, వివిధ రంగాలలో అల్ అప్లికేషన్లను అన్వేషించడానికి గూగుల్తో సమగ్ర భాగస్వామ్యం కోసం ప్రణాళికలను సిద్ధం చేసింది అని తెలియజేసారు.

# సమస్య పరిష్కారం, ఆవిష్కరణ మరియు ఆలోచనలపై వర్క్షాప్

హైదరాబాద్, (శుభోదయం న్యూస్) : చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కి చెందిన ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సభ్యులు ఈ రోజు బేగంపేట్ లో గల పురందర్ రౌండ్-టేబుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమస్య పరిష్కారం, ఆవిష్కరణ మరియు ఆలోచనలపై వర్క్షాప్ను విజయవంతంగా నిర్వహించారు విద్యార్థులలో సృజనాత్మకత మరియు విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించడానికి సిబిఐటి యొక్క కొనసాగుతున్న నిబద్ధతలో ఈ చొరవ భాగం. వర్క్షాప్లో ఎస్ఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు. వినూత్న ఆలోచనల ద్వారా వాస్తవ-ప్రపంచ సమస్యలను గుర్తించడానికి మరియు పరిష్కరించడానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం ఈ వర్క్షాప్ లక్ష్యం. మెదడును కదిలించడం, ఆలోచనలు చేయడం మరియు వివిధ సవాళ్లకు ఆచరణాత్మక పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించే ఇంటరాక్టివ్ సెషన్లలో పాల్గొనేవారు నిమగ్నమయ్యారు. ఇన్స్టిట్యూట్ నుండి నిపుణులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు, నేటి వేగంగా మారుతున్న ప్రపంచంలో ఆవిష్కరణల ప్రాముఖ్యతను అన్వేషించడంలో వారికి సహాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో





విద్యార్థులు వర్క్షాప్లో నేర్చుకున్న భావనలను వర్తింపజేయడానికి అనుమతించే ప్రయోగాత్మక కార్యకలాపాలు కూడా ఉన్నాయి. ఇన్స్టిట్యూట్ యొక్క ఇన్నోవేషన్ కౌన్సిల్ ద్వారా ఈ ఔట్ రీచ్ చొరవ యువ మనస్సులను పెంపొందించడం మరియు భవిష్యత్తు సవాళ్లకు వారిని సిద్ధం చేస్తోంది . అటువంటి కార్యక్రమాలను స్థానిక పాఠశాలలకు తీసుకురావడం ద్వారా, సమాజంలో ఆవిష్కరణ మరియు సమస్య పరిష్కార సంస్కృతిని ప్రోత్సహించడంలో కళాశాల కీలక పాత్ర పోషిస్తోంది. సిబిఐటికి చెందిన డాక్టర్ జిఎన్ఆర్ ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. వాలంటీర్లు శ్రీ బి రవి ప్రకాష్ మరియు శ్రీ లోకేష్ వర్క్షాప్లో స్వచ్ఛంద సేవలను అందించారు.

# చర్చలతోనే పరిష్కారం

### మరోసారి స్పష్టం చేసిన భారత్- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో మోడీ భేటీ నాలుగు ఒప్పందాలపై సంతకాలు

కీవ్ :యుద్ధాలు, దాడులతో ఏ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోలేమని, చర్చలు, సంప్రదింపులు, దౌత్య మార్గాలతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భారత్ మరోసారి స్పష్టం చేసింది.ఉక్రెయిన్లో తొలిసారి పర్యటిస్తున్న ప్రధాని మోడీ, ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చించారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఇరు పక్షాలు ఒక పరిష్కారానికి వచ్చే క్రమంలో కావాలంటే అవసరమైన సాయం అందించడానికి భారత్ సిద్ధంగా వుందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. మోడీ, జెలెన్స్కి సమావేశం అనంతరం కీవ్లో జైశంకర్ మీడియాతో మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం బాగా తగ్గిపోయిందని, ఈ నేపథ్యంలో వాణిజ్య సంబంధాలను పునర్నిర్మించేందుకు అంతర్ ప్రభుత్వ సంఘం (ఐజిసి) ఏర్పాటుపై ఇరుదేశాలు దృష్టి సారించాయని అన్నారు. ఈ ఏడాది చివరిలోగా కమిషన్ తొలి సమావేశం జరుగుతుందన్నారు. రష్యా నుండి ఇంధన కొనుగోళ్లు కూడా చర్చకు వచ్చాయన్నారు. ఇంధన మార్కెట్ పరిస్థితులను భారత్ వివరించిందని, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాల రీత్యా ధరలు స్థిరంగా, సహేతుకంగా వుండేలా చూడాలంటే కొన్ని తప్పనిసరి నిర్ణయాలు వుంటాయని చెప్పారు. ఇరువురు నేతలు సవివరమైన, పారదర్శకమైన, నిర్మాణాత్మకమైన చర్చలు జరిపారని జైశంకర్ తెలిపారు. శాంతి ప్రక్రియలో భారత్ పాత్ర వుండాలని ఉక్రెయిన్ కోరుకుంటోందని చెప్పారు. ఎక్కువ సమయం రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలపైనే చర్చించారని తెలిపారు. ఇప్పటివరకు భారత్ 17విడతలుగా ఉక్రెయిన్కు మానవతా సాయాన్ని అందజేసిందని మంత్రి చెప్పారు.



### నాలుగు ఒప్పందాలు

ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరాయి. వ్యవసాయం, సాంస్కృతిక సహకారం, వైద్య, ఆరోగ్య రంగం, మానవతా సాయం అంశాలకు సంబంధించి కుదిరిన ఒప్పందాలపై మోడీ, జెలెన్స్కి సంతకాలు చేశారు. వాణిజ్యం, ఆర్థిక, రక్షణ, వ్యవసాయ, విద్య తదితర అంశాలపై కూడా చర్చలు జరిగాయి.

### మహాత్ముని శాంతి సందేశం

సామరస్య సమాజ నిర్మాణానికి శాంతి కీలకమని మహాత్ముడు ఇచ్చిన సందేశం ఈనాటికీ కాలానుగుణ్యమైందని మోడీ వ్యాఖానించారు. ఆయన ఆదర్శాలు, విలువలు సార్వజనీన మైనవని, లక్షలాదిమందికి ఆశాకిరణం వంటి వన్నారు. మానవాళికి ఆయన చూపిన మార్గంలోనే మనందరం పయనించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు మోడీ ఎక్స్లో పోస్టు పెట్టారు.

### బిషమ్ క్యూబ్లు అందజేత

పది జనరేషన్ సెట్లతో సహా 22 టన్నుల మెడికల్ పరికరాలను కలిగివున్న బిషమ్ క్యూబ్లను శుక్రవారం భారత్, ఉక్రెయిన్కు అందజేసింది. 1991లో ఉక్రెయిన్కు స్వాతంత్ర్యం లభించి, 1992లో దౌత్య సంబంధాలు ఏర్పడిన తర్వాత తొలిగా పర్యటిస్తున్న భారత ప్రధాని మోడీ అని, ఇది చారిత్రక పర్యటన అని జై శంకర్ వ్యాఖ్యానించారు. రష్యా యుద్ధంలో మరణించిన చిన్నారులపై ఏర్పాటు చేసిన మల్టీమీడియా ఎగ్జిబిషన్ను మోడీ సందర్శించారు. యుద్ధానికి బలైన బాలలను చూస్తుంటే మనసు కలిచి వేస్తోందని మోడీ వ్యాఖ్యానించారు.

## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు కేవలం బాధితులు ఎస్సీ, ఎస్టీలు అయినంత మాత్రాన ఆ చట్టం వర్తించదని స్పష్టీకరణ

# కులం పేరిట వేధిస్తేనే... ఎస్సీ, ఎస్టీ కేసు



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ వేధింపుల (నిరోధక) చట్టం వర్తింపు విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ప్రత్యేకించి కులం పేరిట వేధించినప్పుడు మాత్రమే ఆ చట్టం వర్తిస్తుంది. అంతే తప్ప కేవలం బాధితులు ఆ సామాజికవర్గాలకు చెందినంత మాత్రాన వర్తించబోదు' అని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అభియోగాలు ఎదుర్కొంటున్న షాజన్ స్కారియా అనే యూట్యూబర్కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కేరళకు చెందిన ఎమ్మెల్యే పీవీ శ్రీనిజన్ ఆయనపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద క్రిమినల్ కేసు పెట్టారు. మరుణదాన్ మలయాళీ అనే యూట్యూబ్ చానల్ నడుపుతున్న షాజన్ అందులో పెట్టిన ఒక వీడియోలో తనను ఉద్దేశపూర్వకంగా అవమానించారని ఆరోపించారు. షాజన్ ముందస్తు బెయిల్ పిటిషన్ను కేరళ హైకోర్టు తిరస్కరించింది. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ధర్మాసనం, 'బెదిరింపులకు, లేదా అవమానాలకు గురైన వ్యక్తి కేవలం ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందినంత మాత్రాన సదరు నేరానికి ఎస్సీ, ఎస్టీ వేధింపుల (నిరోధక) చట్టం సెక్షన్ 3(1)(ఆర్) వర్తించబోదు. కులం పేరిట అవమానించినప్పుడు, వేధించినపుడు మాత్రమే వర్తిస్తుంది. సదరు చట్టంలో పేర్కొన్న మేరకు అంటరానితనం వంటి దురాచారాన్ని పాటించినప్పుడు, అగ్ర కులస్తులు మైల, పవిత్రత అంటూ నిమ్నవర్ణాల వారిపట్ల కులం పేరిట దురహంకారపూరితంగా ప్రవర్తించినప్పుడు ఈ సెక్షన్ వర్తిస్తుంది. ఎస్సీ, ఎస్టీలను కులం పేరిట వేధించకుండా చూసేందుకే కఠినమైన సెక్షన్లు చేర్చారు. కనుక ఈ చట్టం వర్తింపులో నిందితుని ఉద్దేశం చాల ముఖ్యం' అని స్పష్టం చేసింది. 'షాజన్ కేసులో అదేమీ కన్పించడం లేదు. సదరు వీడియో ద్వారా ఎస్సీ, ఎస్టీల పట్ల ఉద్దేశపూర్వకంగా ద్వేషం, శతృత్వ భావం, దురుద్దేశాల వంటివి వెళ్లగక్కినట్టు ఎక్కడా రుజువు కాలేదు. ఎమ్మెల్యేను కేవలం వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకున్నారు' అని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులో ప్రాథమికంగా అభియోగాలు నిర్ధారణ అయితే తప్ప ముందస్తు బెయిల్ను తిరస్కరించలేమని స్పష్టం చేసింది.

## తెలంగాణ ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ..



**హైదరాబాద్, :** ఎయిమ్స్ బీబీనగర్ కు అనుబంధంగా అర్బన్ హెల్త్ – ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయడానికి హైదరాబాద్ నగరం నడిబొడ్డున 2 ఎకరాల భూమిని కేటాయించాలని, అప్పటి వరకూ తాత్కాలికంగా ఏదైనా ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని కోరుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాసారు. ఈ లేఖలో.. దేశవ్యాప్తంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయడానికి స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మొదలుకొని అన్ని స్థాయిలలో ఆరోగ్య కేంద్రాల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులో ఉంచడానికి మోడీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని., అందులో భాగంగానే దేశంలోని అనేక రాష్ట్రాలలో ఎయిమ్స్ ఆసుపత్రులను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పుతోందని., అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా 2019 లో బీబీనగర్ లో రూ. 1,300 కోట్లతో ఎయిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన విషయం మీకు తెలిసిందే అంటూ పేర్కొన్నారు. ఇకపోతే ప్రస్తుతం ఎయిమ్స్ బీబీనగర్ లో ఓపీడీ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఎయిమ్స్ మెడికల్ కాలేజీని కూడా కొత్తగా ఏర్పాటు చేయడం, ప్రస్తుతం వైద్య కళాశాల తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. ఎయిమ్స్ నూతన భవనాలు చాలా వేగవంతంగా నిర్మాణం జరుగుచున్నవి. ఎయిమ్స్ బీబీనగర్ హైదరాబాద్ నగరంలో ఒక అర్బన్ హెల్త్ – ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. కేంద్రం ద్వారా వైద్య విద్యార్థులకు అవసరమైన బోధన – శిక్షణ కార్యక్రమాలను, నగరంలో నివశిస్తున్న ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి వీలుగా ఉంటుంది. ఎయిమ్స్ బీబీనగర్ ఎక్స్టెన్షన్ కోసం హైదరాబాద్ నగరంలో తాత్కాలికంగా ఒక ప్రభుత్వ భవనాన్ని కేటాయించినట్లయితే, అక్కడ ఎయిమ్స్ బీబీనగర్ కు అనుబంధంగా అర్బన్ హెల్త్ – ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసి, నగరంలో నివసిస్తున్న ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను వెంటనే అందుబాటులోకి తీసుకువస్తుంది. అలాగే నగరం నడిబొడ్డున 2 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించినట్లయితే.. అర్బన్ హెల్త్ – ట్రైనింగ్ సెంటర్ కు శాశ్వత భవనాన్ని నిర్మాణం చేయడానికి ఎయిమ్స్ బీబీనగర్ సిద్ధంగా ఉందని., ఇదే విషయాన్ని తెలియజేస్తూ.. 26.07.2024 న డెప్యూటీ డైరెక్టర్, ఎయిమ్స్, బీబీనగర్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కు లేఖ వ్రాశారు. కాబట్టి, ఈ విషయంపై మీరు ప్రత్యేకమైన దృష్టిసారించి ఎయిమ్స్ అర్బన్ హెల్త్ – ట్రైనింగ్ సెంటర్ కు శాశ్వత భవన నిర్మాణాన్ని చేపట్టడానికి హైదరాబాద్ నగరంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా 2 ఎకరాల భూమిని ఎయిమ్స్, బీబీనగర్ కు కేటాయించాలని అంతవరకూ తాత్కాలికంగా అందుబాటులో ఉన్న ఏదైనా ప్రభుత్వ భవనాన్ని కేటాయించి అర్బన్ హెల్త్ – ట్రైనింగ్ సెంటర్ సేవలను వెంటనే ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకరించాలని కోరుతున్నట్లు కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## ఉక్రెయిన్‌కు 4 భీష్మ క్యూబ్‌లను అందజేసిన ప్రధాని నరేంద్ర మోడీ..



న్యూఢిల్లీ: శుక్రవారం నాడు ఉక్రెయిన్ రాజధాని కీవ్ లో ఆ దేశ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీతో ప్రధాని నరేంద్ర మోడీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. 'యుద్ధానికి దూరంగా ఉండడమే భారత్ ఎంచుకున్న రెండో మార్గం అని., తాము యుద్ధానికి దూరంగా ఉంటామని.. అందుకోసం భారత్ మొదటి రోజు నుండి పక్షపాతం కలిగి ఉందని సాపేస్తాం చేసారు. అలాగే మా వైపు శాంతి ఉంది.. మేము యావత్ ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహాత్మా గాంధీ భూమి నుండి మేము వచ్చామని తెలిపారు. ఇక ప్రధాని తన పర్యటనలో భారత ప్రభుత్వం తరుపున ఉక్రెయిన్ ప్రభుత్వానికి 4 భీష్మ క్యూబ్ లను అందజేశారు మోడీ. పోలాండ్ నుంచి ప్రత్యేక రైలులో ఉదయం కీవ్ చేరుకున్న ప్రధానికి ఉక్రెయిన్ ఉప ప్రధానమంత్రి స్వాగతం పలికారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, మోదీ నాలుగు క్యూబ్ లను ఉక్రెయిన్ ప్రభుత్వానికి అందజేసారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ దీనికి ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ క్యూబ్ లు గాయపడిన వ్యక్తుల చికిత్సను వేగవంతం చేస్తాయి. ముఖ్యంగా ప్రాణాలను కాపాడడంలో సహకారాన్ని అందిస్తాయి. ప్రతి భీష్మ క్యూబ్ లో వివిధ రకాల గాయాలు, వైద్య పరిస్థితులకు మందులు, ఇంకా అనేక పరికరాలు ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

## తెలంగాణకు పెను భారంగా రుణాలు..!




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ భేటీ అనంతరం భట్టి మాట్లాడుతూ.. మొత్తం 8 అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రికి వినతిపత్రం ఇచ్చాను. కేంద్ర మంత్రి చాలా సానుకూలంగా స్పందించారు. కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సహాయం చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. అయితే పెండింగ్ నిధులను వెంటనే విడదల చేయాలని కోరాం. ప్రస్తుతం తెలంగాణకు రుణాలు పెను భారంగా మారాయి.గత ప్రభుత్వం 31,795 కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంది. 10.75 శాతం, 11.25 శాతం వడ్డీ రేటుతో ఈ రుణాలు తీసుకుంది. అలాగే రుణాలు "రీస్ట్రక్చర్" చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరాం. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే జీతాల కంటే, పెద్ద మొత్తంలో తీసుకున్న అప్పులకు వడ్డీలు కడుతున్నాం అని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు.।

## ఇప్పుడే చైనాతో భాగస్వామ్యమవసరం లేదు




న్యూఢిల్లీ : అంతరిక్ష పరిశోధనల్లో అవసరం అనుకుంటే భారత్ చైనాతో భాగస్వామ్యమవుతుంది. కానీ ప్రస్తుతం భారత్కు అలాంటి అవసరం లేదని ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ శుక్రవారం అన్నారు. ఆగస్టు 23వ తేదీ నేషనల్ స్పేస్ డే (జాతీయ అంతరిక్ష దినోత్సవం) రోజున చైనాతో సంబంధాలు పెట్టుకోవడం వల్ల భారతీయ శాస్త్రవేత్తలు ప్రయోజనం పొందగలరా ముఖ్యంగా చంద్రయాన్– 4 మిషన్ సందర్భంలో అని మీడియా అడిగిన ప్రశ్నపై సోమనాథ్ సమాధానమిచ్చారు. 'చంద్రయాన్ మిషన్కి కచ్చితమైన టైమ్ లైన్ లేదు. బహుశా 2030కి ముందు ఈ మిషన్ జరిగే అవకాశం ఉంది. చంద్రుని మట్టి నమూనాలను సేకరించి, కొన్నింటిని తిరిగి భూమికి తీసుకురావడానికి చంద్రునిపైకి ప్రోబ్ని పంపడం ఈ మిషన్ ప్రయోగముంటుంది. ఈవిధమైన విజయవంతమైన మిషన్ భూమికి దూరంగా రిమోట్గా రాకెట్ను ప్రయోగించే ఇస్రో యొక్క సాంకేతిక సామర్థ్యాన్ని రుజువు చేస్తుంది. ఈ మిషన్లో మేము మా స్వంత సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి, అభివృద్ధి చేసుకోవడానికి కృషి చేస్తున్నాము. ఏవైనా లోపాలు కనిపిస్తే.. వాటిని సరిదిద్దుకోవడానికి చైనాతో భాగస్వామ్యమవుతాము' అని సోమనాథ్ సమాధానమిచ్చారు.

# వినూత్న విదేశాంగ విధానం



నలుగురు నడిచిన బాటలో నడవటం, సంప్రదాయంగా వస్తున్న విధానాలను అనుసరించటం శ్రేయస్కరమని చాలామంది అనుకొనేదే. కొత్త ప్రయోగాలకు దిగితే ఏం వికటిస్తుందోనన్న సంశయమే ఇందుకు కారణం. ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించిన తాజా యూరోప్ పర్యటన మన విదేశాంగ విధానం కొత్త మలుపు తిరిగిన వైనాన్ని వెల్లడించింది. ఇది మంచిదా, కాదా అన్నది ముమ్ముందు తేలుతుంది. అయితే తాము ఎవరికీ దగ్గరా కాదు... దూరమూ కాదని అటు రష్యాకూ, ఇటు పాశ్చాత్య దేశాలకూ మనం చెప్పినట్టయింది. ఒక రకంగా ఇది ప్రచ్ఛన్న యుద్ధ దశలో మన దేశం అనుసరించిన అలీన విధానాన్ని గుర్తుకుతెస్తుంది. మోదీ రెండు రోజులు పోలెండ్‌లో పర్యటించారు. అధ్యక్షుడు ఆంద్రెజ్ దుదాతో సమావేశమయ్యారు శుక్రవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో చర్చలు జరిపారు. ఇవి రివాజులో భాగంగా సాగిన పర్యటనలు కాదు. మన దేశ ప్రధాని ఒకరు పోలెండ్‌ను సందర్శించటం గత నలభై అయిదేళ్లలో ఇదే తొలిసారి. 1955లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, 1967లో ఇందిరా గాంధీ, 1979లో మొరార్జీ దేశాయ్ ఆ దేశంలో పర్యటించారు. కానీ అప్పటికది సోవియెట్ యూనియన్ ఛత్రచ్ఛాయలో ఏర్పడ్డ వార్సా సైనిక కూటమిలో భాగం. అయితే, 1991లో సోవియెట్ యూనియన్ కుప్పకూలడానికి చాలా ముందే పోలెండ్ బాట మార్చింది. సోవియెట్‌కు వ్యతిరేకంగా ఏర్పడిన నాటో కూటమి దేశాలకు చేరువైంది. 1999లో నాటోలో చేరింది. 2004లో యూరొపియన్ యూనియన్ (ఈయూ)లో భాగమైంది. ఆ తర్వాత మరెప్పుడూ మన ప్రధానులు ఆ దేశాన్ని సందర్శించ లేదు. ఇక సోవియెట్‌లో ఒకప్పుడు భాగమైన ఉక్రెయిన్ 26 ఏళ్ల క్రితం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. పాశ్చాత్య దేశాల సలహాతో తన అణ్వస్త్రాలను స్వచ్ఛందంగా వదులుకుంది. భిన్న సందర్భాల్లో వాటి మనోభావాలకు తగినట్టు తన విధానాలను తీర్చిదిద్దుకుంది. వాజపేయి హయాంలో మన దేశం నిర్వహించిన అణు పరీక్షలను వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేసింది. మన కశ్మీర్ విధానాన్ని ఖండిస్తూ వచ్చింది. పాకిస్తాన్‌కు శతఘ్నులు విక్రయించింది. రెండు దేశాల మధ్య ఉండే ద్వైపాక్షిక సంబంధాలు మూడో దేశానికి వ్యతిరేకమని భావించటం మూర?త్వమే అవుతుంది. అలాంటి మూర?త్వాన్ని ఈమధ్య అమెరికాతో పాటు ఉక్రెయిన్ కూడా ప్రదర్శించింది. జూలై రెండో వారంలో మోదీ రష్యాలో పర్యటించినప్పుడు జెలెన్స్కీ ట్విటర్ వేదికగా భారత్‌ను విమర్శించారు. నెత్తురంటిన పుతిన్‌తో ఎలా కరచాలనం చేస్తారని మోదీని ప్రశ్నించారు. ప్రపంచంలోనే అత్యంత క్రూరుడైన నేరగాడిని హత్తుకోవటం విచారకరమన్నారు. ఆ సమయంలో మోదీ తమ దేశంలో ఉన్నారన్న సంగతిని కూడా విస్మరించి కియూవ్‌లో పిల్లల ఆస్పత్రిపై రష్యా బలగాలు దాడి చేసిన మాట వాస్తవమే. అయితే ఆ ఉదంతాన్ని పుతిన్ సమక్షంలోనే మోదీ ఖండించారు. అయినా జెలెన్స్కీకి అది సరిపోలేదు. తాము రష్యాతో యుద్ధం చేస్తున్నాం గనుక ప్రపంచమంతా దాన్ని దూరం పెట్టాలన్న వైఖరిని ప్రదర్శించారు. ఇది తెలివితక్కువతనం. భారత్–రష్యా సంబంధాల సంగతే తీసుకుంటే రష్యా అనేక కారణాల వల్ల పాకిస్తాన్‌కు ఆయుధ విక్రయంపై ఉన్న ఆంక్షలను పదేళ్లక్రితం సడలించింది. దూరశ్రేణి క్షిపణులు, ఇతర రక్షణ పరికరాలు అందజేసింది. ఎంఐ–26 సైనిక రవాణా హెలికాప్టర్లను సమకూర్చుకోవటానికి సాయం అందజేసింది. మనకు ఆయుధాలు, ఇతర రక్షణ పరికరాలు విక్రయించినప్పుడల్లా సమతూకం పాటించే నెపంతో పాకిస్తాన్‌కు కూడా అమ్మకాలు సాగించటం రష్యా నేర్చుకుంది. చైనాతో దాని సంబంధాలు సరేసరి. ఇలా మనకు బద్ధ వ్యతిరేకమైన రెండు దేశాలతో రష్యా సంబంధాలు నెరపుతున్నప్పుడు మనం మాత్రం తమతోనే ఉండాలని అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ కోరుకోవటం అర్థరహితం. రష్యా – ఉక్రెయిన్‌ల మధ్య మూడేళ్లుగా సాగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ఒక తటస్థ దేశంగా భారత్ కృషి చేయాలని చాలా దేశాలు ఆశపడుతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణను మన దేశం ఖండించలేదు. రష్యాను విమర్శిస్తూ తీసుకొచ్చిన తీర్మానాలపై వోటింగ్ సమయంలో మన దేశం గైర్హాజరైంది. అయితే యుద్ధ క్షేత్రంలో కాక చర్చలతో, దౌత్యంతో మాత్రమే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని వివిధ అంతర్జాతీయ వేదికలపై మోదీ ఈ మూడేళ్లుగా చెబుతూ వచ్చారు. ఇరు దేశాలూ చర్చలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. సరిగ్గా నాటో 75 యేళ్ల ఉత్సవాల సందర్భంలో రష్యా పర్యటనను ఎంచుకున్నందుకు అమెరికా ఆగ్రహించింది. అయితే ఎడతెగకుండా సాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలకడమెలా అన్నది దానికి బోధపడటం లేదు. తన మద్దతుతో, పాశ్చాత్య దేశాల సహకారంతో 3, 4 నెలల్లో రష్యాను ఉక్రెయిన్ అవలీలగా జయిస్తుందన్న భ్రమ మొదట్లో అమెరికాకు ఉంది. కానీ రోజులు గడిచేకొద్దీ అది కొడిగట్టింది. నిరుడు ఫిబ్రవరిలో శాంతి సాధన పేరుతో చైనా ఒక ప్రతిపాదన చేసింది. కానీ అందులో రష్యావైపే మొగ్గు కనబడుతోందన్న విమర్శలొచ్చాయి. పైపెచ్చు చైనా అధికారిక మీడియా మొదటి నుంచీ రష్యాను వెనకేసుకొస్తోంది. ఇలాంటి సమయంలో భారత్ దౌత్యంపై ఆశలేర్పడటం సహజం. అయితే పరస్పరం తలపడుతున్న వైరి పక్షాలు మానసికంగా చర్చలకు సిద్ధపడితే తప్ప ఎవరి ప్రయత్నాలైనా ఫలించే అవకాశాలుండవు. ముఖ్యంగా ఈ యుద్ధంలోని నిరర్థకతను రష్యాతో పాటు అమెరికా, యూరొప్ దేశాలు గుర్తించాల్సివుంది. ఆ తర్వాతే ఉక్రెయిన్ దూకుడు తగ్గుతుంది. ఆ మాటెలావున్నా మోదీ పర్యటన మన విదేశాంగ విధానానికి కొత్త బాట పరిచింది.

# ఎలా చూసినా కులగణనే కీలకం!



ఎన్నికల వేళ సందడి చేసిన కులగణన వాదం ఆ తర్వాత కూడా చర్చనీయాంశంగా కొనసాగుతూనే ఉంది. సుప్రీంకోర్టు దేశంలోని ఉపకులాలకు న్యాయం జరిగేలా ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లను విభజించవచ్చని వెలువరించిన తీర్పు ఇప్పుడు ఎంతో కీలకంగా మారింది. అయితే ఈ తీర్పును అమలుపరచడానికి రాష్ట్రాలు వేటికవి తమ ప్రాంతాల్లో కులగణన చేస్తే కుదరదు. కేంద్రం మాత్రమే జనాభా లెక్కల్లో భాగంగా ఈ పని చేయాలి. లేదంటే కోర్టులో కొత్త వివాదాలు తలెత్తుతాయి. అయితే రిజర్వేషన్ల వల్ల అత్యధిక ప్రయోజనం పొందుతున్న కులాలవారూ, అలాగే స్థానికంగా బలంగా ఉన్న రిజర్వేషన్ వెలుపల ఉన్న శూద్ర కులాలవారూ కులగణనను వ్యతిరేకిస్తూనే ఉన్నారు. దేశంలోని ఉపకులాలకు న్యాయం జరిగేలా ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లను విభజించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. పోతే ఆ విభజన న్యాయబద్ధ ఆబ్జెక్టివ్‌గా తేల్చిన జనాభా లెక్కల ప్రకారమే చెయ్యాలని కూడా తేల్చి చెప్పింది. ఈ జడ్జిమెంట్ ప్రకారం ఇటువంటి లెక్కలు రాష్ట్రాలు కమిషన్ల ద్వారానో, లేదా స్వంత రాష్ట్రస్థాయి జనాభా గణన చేపట్టి చెయ్యలేరు. ఏ కేంద్ర ప్రభుత్వమైతే సుప్రీంకోర్టు ముందు ఉపకులాలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్ పంపకం అవసరమే అని ఒప్పుకుందో... ఆ ప్రభుత్వమే కేంద్ర స్థాయిలో కులాల వారీగా జనాభా లెక్కలు తీయించే వరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ జడ్జిమెంట్ అమలుకు పూనుకోలేదు. ఒకవేళ ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం సొంత రాష్ట్ర ఉపకులాల లెక్కలు తీయించి, ఏదో ఒక రిజర్వేషన్ కేటగిరీలో రిజర్వేషన్ విభజిస్తే ఆ విభజన మళ్లీ హైకోర్టులో ఉపకుల లెక్కల యాక్యురసీ (కచ్చితత్వం) కొట్టివేయబడుతుంది. చివరకు సుప్రీంకోర్టుకు పోయినా అదే సమస్య ఎదురవుతుంది.

### ఇది ఎస్సీ, ఎస్టీల సమస్య మాత్రమే కాదు...

ఇప్పటికే ఉప కులాల లెక్కలు తీసిన బిహార్ రిజర్వేషన్ విభజన, పెంపుదలను ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్ల ఉపకుల న్యాయపర విభజన కేవలం ఎస్సీలకో, ఎస్టీలకో సంబంధించింది మాత్రమే కాదు. ఓబీసీ కులాల్లో అన్ని రాష్ట్రాల్లో తమ తమ ఉపకులాల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు, సీట్లు రావడం లేదని ఉద్యమాలు నడుస్తున్నాయి. ఉదాహరణకు తెలుగు రాష్ట్రాల్లో మాదిగ, మాల కులాలకోబీ కోయ, గోండు, చెంచు, లంబాడాల మధ్య విభజనకో సుప్రీంకోర్టు జడ్జిమెంట్ పరిమితమై లేదు. బీసీ కులాల్లో ఉన్న ఏబీసీడీ గ్రూపుల్లో చాలా ఉప కులాలున్నాయి. డీ గ్రూపులో గొల్ల–యాదవులకు... మున్నూరు కాపులకు దొరికే అవకాశాలు దొరకడం లేదనీ, బీ గ్రూపులో కురుమలకు తమ వాటా తమకు దొరకడం లేదనే తీవ్ర అసంతృప్తి ఉంది. అందుకే వాళ్ళు తమ కులాన్ని సెమీ–నొమాడిక్ కమ్యూనిటీ (అర్ధ సంచార జాతి) లోకి మార్చాలని డిమాండ్ ఉంది. మహారాష్ట్రలో ధనగర్‌లు (గొర్రెల కాపర్లు) చాలా ఉద్యమాలు నడిపి తమ కులానికి మొత్తం ఓబీసీ రిజర్వేషన్‌లో 3 శాతం వాటా సంపాదించుకున్నారు. అక్కడి మరాఠాలు తమకూ రిజర్వేషన్లు కావాలని చాలా కాలంగా పోరాడుతున్నారు. కోర్టులు అందుకు అంగీకరించనందున తమకు కుంబి కులసర్టిఫికెట్లు ఇచ్చి రిజర్వేషన్లోకి చొప్పించండి అని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారు. గుజరాత్‌లో పటేళ్లు (పాటీదార్లు) తమకూ రిజర్వేషన్లు కావాలని చాలా కాలంగా ఉద్యమాలు చేస్తున్నారు. ఉపకుల రిజర్వేషన్ జడ్జిమెంట్ ద్వారా ఈ అన్ని రకాల డిమాండ్లకు పరిష్కారం వెతకాల్సి ఉంటుంది. 2024 ఎన్నికల్లో ఓట్ల కోసం చాలా రాష్ట్రాల్లో బీజేపీ ఉపకులాలకు 'మీ వాటా మీకు ఇప్పిస్తామని' వాగ్దానం చేసింది. ప్రధానమంత్రి స్వయంగా ఆ మీటింగులో పాల్గొన్నారు. కానీ జాతీయ స్థాయిలో కుల గణన చేయించడాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అయితే సుప్రీంకోర్టు జడ్జిమెంట్... 1931 నాటి జనాభా లెక్కల్లో చేసినట్లు కులగణనను జనాభా లెక్కల్లో భాగంగా చెయ్యాల్సిన అవసరాన్ని కేంద్రం ముందు పెట్టింది. ఇక తప్పించుకోవడం సాధ్యం కాదు.

### కాంగ్రెస్ వెనక్కి తగ్గింది!

కాంగ్రెస్ పార్టీ 2011 జనాభా లెక్కల్లో భాగంగా కులగణన ఒక ప్రత్యేక కుల లెక్కల షెడ్యూల్‌ను తయారుచేసి లెక్కలు తీయించారు. కానీ శుద్రాతీత అగ్రకులాల్లో (బ్రాహ్మణ, బనియా, క్షత్రియ, కాయస్థ, ఖత్రి కులాల వారి నుండి) వ్యతిరేకత రావడం వల్ల ఆ లెక్కలు బయట పెట్టకుండా ఆపేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో మేధావి వర్గమంతా ఈ ఐదు కులాల వారే! 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ కులజనాభా లెక్కలు కావాలని కాంగ్రెస్ ఓట్ల శాతం పెంచే ప్రయత్నం చేశారు. కానీ రిజర్వేషన్ బయట ఉన్న కులాల నుండి అన్ని పార్టీల్లో వ్యతిరేకత వస్తోంది. ఈ కారణం వల్లనే కర్ణాటకలో కులాల లెక్కలు తీసి కూడా బయట పెట్టకుండా ఆపేశారు. కారణం బ్రాహ్మణ, బనియా, లింగాయత్, వక్కళి కులాల నుండి తీవ్రమైన వ్యతిరేకత వస్తుంది కనుక. వీటన్నిటికి మూలమేమంటే చాలా చిన్న శూద్రేతర కులాలు చాలా పెద్ద మొత్తంగా ఉద్యోగాలు, ప్రభుత్వరంగ ఐఐటీ, ఐఐఎమ్‌లు, మెడికల్ కాలేజీల్లో సీట్లు పొందుతున్నాయి. వీరి కులాల సంఖ్య జనాభా లెక్కల ద్వారా బయటికి వస్తే వారు దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని నడుపడానికి వ్యతిరేకంగా చాలా పెద్ద తిరుగుబాటు వస్తుంది.

### మొత్తం మీద శూద్రుల వాటా తక్కువే!

రెండు తెలుగు రాష్ట్రాల్లో రెడ్లు, కమ్మలు, వెలమలకు కూడా అర్థం కాని అంశమేమంటే... ఢిల్లీ అధికారంలోగానీ, బ్యూరాక్రసీలోగానీబీ గవర్నర్లు, అంబాసిడర్ల వంటి పదవుల్లో కానీ వీరి వాటా చాలా తక్కువ అనేది. రిజర్వేషన్ బయట ఉన్న మొత్తం శూద్ర అగ్ర కులాలకు వారి జనాభా లెక్కల ప్రకారం చూస్తే కేంద్ర అధికారంలో కానీ, మోనోపలీ క్యాపిటల్‌లో కానీ అతి కొద్దిపాటి వాటా మాత్రమే ఉన్నది. కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్‌లో కాని, ప్రధానమంత్రి సెక్రటేరియట్‌లో కాని వారు ఎవ్వరూ కనబడరు. వారు కేవలం రాష్ట్ర అధికారం కోసమే ఆరాటపడుతున్నారు. కానీ కేంద్రంలో మొత్తం శూద్రుల వాటా చాలా చిన్నదిగా ఉంది. కుల గణన... రెడ్డి, కమ్మ, వెలమ వంటి కులాలు జాతీయ స్థాయిలో వాటా పొందడానికి పనికొస్తుంది. ఇదే పరిస్థితి కర్ణాటకలోని లింగాయత్, వక్కళి కులస్థులది కూడా! వాళ్ళు రాష్ట్ర రిజర్వేషన్ సిస్టమ్‌లో భాగస్వాములే కానీ కులలెక్కలను వ్యతిరేకిస్తున్నారు. కేరళలో నాయనార్లు కుల లెక్కలే కాదు రిజర్వేషన్లను కూడా వ్యతిరేకిస్తున్నారు. వాళ్ళు తాము శూద్రులం కాదు క్షత్రియులమని చెప్పుకుంటున్నారు. ఇది కేవలం ఆ చిన్న రాష్ట్రంపై పెత్తనం చలాయించడానికి పనికొస్తుంది. కానీ కేంద్రంలో నాయనార్లకు కూడా వాటా లేదు. ప్రతి రాష్ట్రంలో ఉన్న శూద్ర పై కులాలు కులగణనను ఎందుకు స్వాగతించాలో ఆలోచించడం లేదు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం కులాల లెక్కలు తీసి ఉండకపోతే దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న బ్రాహ్మణులు తామే దేశంలో అత్యధికులం అని నమ్మించేవారు. అంతకుముందు బ్రిటిష్ ప్రభుత్వాన్ని వాళ్ళు అలానే నమ్మించారు. దేశం మొత్తం మీద బ్రిటిష్ పాలక వ్యవస్థ (అడ్మినిస్ట్రేషన్)లో వాళ్ళే ఉండేవారు. జనాభా రీత్యా కూడా 'మేమే అన్ని కులాల కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నామ'ని నమ్మించేవారు. ఆచరణలో కులం ఉన్నప్పుడు ఆ కులం సంఖ్య ఎంత ఉందో తెలిస్తే తప్ప కులాల అభివృద్ధి, దేశం అభివృద్ధి జరిగే ప్రణాళికలు తయారు చెయ్యడం సాధ్యం కాదు. తక్కువ సంఖ్యలో ఉండి ఎక్కువ ఉద్యోగాలు, విద్యారంగంలో సీట్లు సంపాదించే కులాలు, కులం లెక్కలు తియ్యొద్దని తప్పకుండా వాదిస్తాయి. ఈ ఆలోచనా ధోరణి నుండే రిజర్వేషన్లలో 50 శాతానికి మించి ఉండకూడదని వాదించాయి. సుప్రీంకోర్టులో తమకు అనుకూల జడ్జిమెంటును సంపాదించాయి. దానికి మెరిట్ అనే ఒక వాదనను ముందు పెట్టాయి. అసలు కులాన్ని ఈ దేశానికి బ్రిటిష్ వలసవాదులు తెచ్చారని వాదించాయి. ఉత్పత్తి కులాలు ముఖ్యంగా శూద్రులు ఢిల్లీలో పాలకులైతే తమ చరిత్ర తలకిందులవుతుందని భావించాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉపకులాల వాటా జడ్జిమెంట్ చరిత్ర మలుపును మరో మెట్టు ఎక్కించేదనే అంశంలో సందేహం లేదు. ఇప్పుడు అన్ని శూద్ర కులాలు, దళితులు, ఆదివాసులు ఐక్యంగా కుల జనాభా లెక్కలు చెయ్యాలని పోరాడటమే వారి భవిష్యత్తుకు మార్గం.

# శకలాలకు తావివ్వని విధంగా రోదసి ప్రయోగాలు

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

దిల్లీ: ప్రపంచ దేశాలు పెద్దసంఖ్యలో ఉపగ్రహాలను నింగిలోకి ప్రయోగిస్తున్నందువల్ల అంతరిక్షంలో శకలాలు పెరిగిపోతున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం ఆందోళన వ్యక్తంచేశారు. 2030కల్లా శకలాలకు తావులేని విధంగా అంతరిక్ష ప్రయోగాలు నిర్వహించేలా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) లక్ష్యంగా పెట్టుకోవడం ప్రశంసనీయమన్నారు. గత ఏడాది చంద్రయాన్–3.. విజయవంతంగా చందమామపై కాలుమోపిన నేపథ్యంలో ఏటా ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తొలి స్పేస్ డే శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మోదీ.. ఎక్స్‌లో దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగ ఉజ్వల భవిష్యత్తు కోసం పలు నిర్ణయాలు తీసుకున్నామనీ, ముమ్ముందు మరిన్ని కీలక చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దిల్లీలోని భారత మండపంలో ఏర్పాటైన మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో ప్రసంగించిన రాష్ట్రపతి.. ముర్ము ఇస్రో విజయాలు భారత సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తున్నాయని ప్రశంసించారు. భారతీయ రోదసి శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు అతి తక్కువ వనరులతో అద్భుత విజయాలను సాధించారని కొనియాడారు. అంతరిక్షంలో 10 సెంటీమీటర్లకన్నా పెద్దవైన శకలాలను పసిగట్టే వ్యవస్థను రూపొందించామని ఇస్రో అధ్యక్షుడు సోమనాథ్ పేర్కొన్నారు.

2040 నాటికి చందమామపైకి భారతీయుడు

2035 నాటికి రోదసిలో భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) సాకారమవుతుందని, 2040 నాటికి చందమామపైకి భారత సంతతి వ్యోమగామిని పంపుతామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. వచ్చే ఏడాది భూ దిగువ కక్ష్యలోకి చేపట్టే మానవసహిత అంతరిక్ష



యాత్ర.. భారతీయ శాస్త్రీయ పరిశోధనల విస్తరణ దిశగా ముందడుగని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాట్‌కామ్ ఇండియా అసోసియేషన్–ఇండియా అధ్యక్షుడు పావులూరి సుబ్బారావు మాట్లాడుతూ.. అంతరిక్ష రంగంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విధానాలు, సంస్కరణల వల్ల దేశీయ ప్రైవేటు కంపెనీలకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. నిధులు, మౌలిక వసతులు వంటి అంశాల్లో సవాళ్లు ఉన్నప్పటికీ భవిష్యత్ ఆశాజనకంగా ఉందని తెలిపారు. ప్రపంచ అంతరిక్ష దిగ్గజంగా ఎదిగే సామర్థ్యం భారత్‌కు ఉందని పేర్కొన్నారు.

## ప్రభుత్వం స్పందించలేదని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు..



**అమరావతి,:** పులివెందుల ఎమ్మెల్యే అనకాపల్లి వచ్చి ప్రమాదంపై మంత్రులు ,ప్రభుత్వం స్పందించలేదని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు ప్రమాదాలు జరగడం దురదృష్టకరమని.. ఎసెన్షియా ఫార్మాలో ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం యంత్రాంగం అప్రమత్తం అయిందన్నారు. ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించి రెస్క్యూ ఆపరేషన్ చేయకపోతే మృతుల సంఖ్య పెరిగేదన్నారు. వెంటనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయన్నారు. క్షతగాత్రులను తక్షణమే హాస్పటల్స్‌కు తరలించామని మంత్రి తెలిపారు. ప్రమాదం రోజు విజయవాడ నుంచి తాను రోడ్డు మార్గంలో సంఘటనా స్థలానికి రాత్రి 12 బీ30 కు చేరుకున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షతగాత్రులను పరామర్శించారని చెప్పారు. ప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని పరిశీలించారని.. తక్షణమే అధికారులతో సమీక్ష నిర్వహించారని వెల్లడించారు. సీఎం ప్రకటించిన 24 గంటలు గడవక ముందే ఎక్స్‌గ్రేషియా అందజేశామన్నారు. జగన్ ధర్నా చేయాలంటే చాలా ఉన్నాయన్నారు. ఎల్జీ పాలిమర్స్ ఘటన జరిగిన తర్వాత యాజమాన్యాన్ని ఎక్కడకు పిలిపించుకున్నారని.. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారా అంటూ ప్రశ్నించారు. ఎల్జీ పాలిమర్స్‌లో 15 మంది మృతి చెందితే, 12 మందికే ఎక్స్ గ్రేషియా ఇచ్చారని విమర్శించారు. ముగ్గురికి ఇప్పటికి ఎక్స్ గ్రేషియా ఇవ్వలేదని ఆరోపించారు.

## ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

### కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు!



న్యూఢిల్లీ: ఝార?ండ్ పరిసర ప్రాంతాలపై అల్పపీడనం కొనసాగుతోంది. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తా జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రెండు రోజుల్లో ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడనున్న మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. విజయనగరం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయగోదావరి, కర్నూలు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, ఉత్తర బంగాళాఖాతంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు.

## రష్యన్ జైలులో ఖైదీల మధ్య ఘర్షణ.. 8 మంది మృతి



రష్యాలోని ఓ జైలులో ఖైదీల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఎనిమిది మంది చనిపోయారు. వీరిలో నలుగురు జైలు ఉద్యోగులు కూడా ఉన్నారు. రష్యాలోని వోల్గోగ్రాడ్ ప్రాంతంలోని అత్యంత భద్రత కలిగిన ఐకే-19 సురోవికినో శిక్షాస్మృతి కాలనీలో ఈ హింసాకాండ చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం.. కొంతమంది ఖైదీలు హింసాత్మకంగా తిరుగుబాటు చేశారు. కత్తులు పట్టుకుని.. తాము ఇస్లామిక్ స్టేట్‌కు సంబంధించినవారంటూ హల్?చల్ చేశారు. అంతేకాకుండా.. కొంతమంది ఖైదీలను బెదిరిస్తూ.. జైలులో కొంత భాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముస్లింలపై అణచివేతకు ప్రతీకారం తీర్చుకునేందుకే దాడి చేశామంటూ వారు పేర్కొన్నారు. ఒక సాధారణ క్రమశిక్షణ సమావేశం నిర్వహించాల్సిన సమయంలో ఈ ఘర్షణ తలెత్తిందని ఒక నివేదిక పేర్కొంది. ఈ సమావేశం జరుగుతుండగా.. రామ్‌జిడిన్ తోషోవ్ (28), రుస్తమ్‌చోన్ నవ్రూజీ (23), నజిర్చోన్ తోషోవ్ (28), తైమూర్ ఖుసినోవ్ (29) అనే ఖైదీల బృందం దాడులకు దిగింది. ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్‌లకు చెందిన నలుగురు వ్యక్తులు కత్తులతో గార్డులపై దాడి చేశారు. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. అలాగే ఎనిమిది మంది జైలు సిబ్బంది.. నలుగురు తోటి ఖైదీలను బందీలుగా తీసుకుని దాడి చేశారు. కాగా.. ఈ ఘర్షణకు సంబంధించిన ఫోటో ఒకటి సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. అందులో.. రక్తంతో తడిసిన జైలు గార్డుపై ఒక ఖైదీ కత్తిని పట్టుకోవడం కనిపిస్తుంది. మరో వీడియోలో జైలు యార్డ్‌లో దాడి చేసిన వారిని చూపిస్తుంది. ఇక్కడ ఒక ఖైదీ ముఖమంతా రక్తంతో తడిసి పోయింది. అంతేకాకుండా.. ఆ వీడియోలో దాడి చేసిన వారు ఐసిస్‌కు తమ విధేయతగా ప్రతిజ్ఞ చేశారు. ముస్లింలను హింసించినందుకు ప్రతీకారంగా ఈ దాడి జరిగిందని వారు పేర్కొన్నారు. పరిస్థితి మరింత దిగజారడంతో.. సాయుధ ప్రత్యేక రష్యన్ దళాలు, స్నిపర్లు మోహరించారు.ు

## అనుకోకుండా ఒక మాట తొర్లాను.. కేటీఆర్ కామెంట్స్..




**హైదరాబాద్, :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయానికి చేరుకున్న సందర్భంగా.. ఆయనను అడ్డుకునేందుకు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు విశ్వ ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే కేటీఆర్ వ్యాఖ్యలకు వ్యతిరేకరంగా వారు నిరసన వ్యక్తం చేశారు. ఇకపోతే, రాష్ట్ర ?మహిళా కమిషన్ (బుద్ధ భవన్) ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేసిన కారణంగా ఆయనకు ఉమెన్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో మహిళా కమిషన్ ముందు వివరణ ఇచ్చేందుకు ఆయన ఆఫీసుకు వెళ్లిగా నిరసన సెగ తగిలింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నేను ఒక మీటింగ్ లో అనుకోకుండా ఒక మాట తొర్లాను. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా ఇప్పటికే మహిళా మణులకు క్షమాపణ చెప్పాను. ఈ విషయం పై మహిళా కమీషన్ నోటీసులు ఇచ్చింది. అందుకోసం మహిళా కమీషన్ క్షమాపణ కోరాను. మహిళా కమీషన్ దృష్టికి ఈ 6 నెలల నుంచి జరిగిన విషయాలు కూడా చెప్పాలనుకున్నాం. కానీ., వాటిపై మళ్లీ వచ్చి కాలవాలని చెప్పారు. మా మహిళా నాయకురాల్ల మీద కాంగ్రెస్ మహిళ నేతలు దాడులు చేశారు. దీనిని మహిళ కమీషన్ సుమోటోగా తీసుకొని కేస్ బుక్ చేయాలని ఆయన అన్నారు.

# ఇండియా ఇన్ స్పేస్




ఆదిమానవుల కాలం నుంచి నేటి ఆధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యుగం వరకు విశ్వావిర్భావం, నక్షత్రాల, గ్రహాల గమనాలపై మానవుని అన్వేషణ, ఆసక్తి, అభిరుచి, జ్ఞాన శోధన మరియు పరిశోధనల ప్రయత్నాల పరంపర వంటివి ఆగకుండా ,అలుపన్నది లేకుండా కొనసాగుతూనే వుంది.రాత్రి పూట ఆకాశ వీధుల్లో కనిపించే ఎన్నో అద్భుతాలు "అంతరిక్ష అయస్కాంతం"లా మనిషి కెమెరా కంటిని ఆకర్షిస్తూనే వున్నాయి. చిన్నప్పుడు పిల్లలు తినడానికి మారాం చేస్తే అమ్మ చందమామ రావే,జాబిల్లి రావే అని చందమామను చూపిస్తూ,మాటలతో మరిపిస్తూ,మురిపిస్తూ "గోరు వెన్నెల ముద్దలు" తినిపించే స్థాయి నుంచి జాబిల్లి ఉపరితలాన్ని స్పర్శించే స్థాయికి ఎదిగింది మానవ మేధస్సు కృషి..!త్వరలోనే అమ్మ జోల పాట చందమామ ఉపరితలంపై పాడే రోజులు రాబోతున్నాయి..!చుక్కల్లో జాబిల్లి మనకు ఎప్పటికీ ప్రత్యేకమే.మన గ్రహానికి సంబంధించిన ఒకే ఒక సహజ ఉపగ్రహం చంద్రుడు.అందుకే ఈ "నెలరాజు"పై ప్రపంచ శాస్త్రవేత్తలకు కూడా ప్రత్యేక అభిమానం. నేడు మనందరికి గర్వకారణమైన భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చేపట్టిన చంద్రయాన్ -3 మిషన్ లో భాగంగా గత సంవత్సరం(2023) ఆగస్టు 23న సాయంత్రం 6:04 గంటలకు యావత్ ప్రపంచం ఆసక్తితో చూస్తుండగానే ల్యాండర్ విక్రమ్ చంద్రుడి దక్షిణ ధృవానికి సమీపంలో సురక్షితంగా సాఫ్ట్ ల్యాండ్ చేసింది.ఆ క్షణాన ప్రతి భారతీయుడి గుండె వందేమాతరం నినాదంతో సగర్వంగా మన త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేసింది.ఆ తర్వాత ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ రోవర్ బయటికొచ్చి చంద్రుని ఉపరితలాన్ని పరిశీలించి,పరిశోధించి శాస్త్రీయ సమాచారాన్ని మన శాస్త్రవేత్తలకు పంపించింది.ఒక హాలీవుడ్ సినిమా నిర్మాణం కంటే తక్కువ ఖర్చుతో భారత్ చేసిన ప్రయోగం చంద్రయాన్ -3మిషన్ సాయంతో చంద్రునిపై అడుగుపెట్టిన నాల్గవ దేశంగా మరియు చంద్రుని దక్షిణ ధృవానికి సమీపంలో సురక్షితంగా చేరిన మొదటిదేశంగా నవచరిత్ర సృష్టించింది.ఈ సందర్భంగా మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల అసామాన్యమైన కృషిని ఆగస్టు 26,2023న మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మనందరి తరపున కొనియాడారు.ఆ సందర్భంగా విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశానికి "శివశక్తి" అని నామకరణం చేసి ప్రతి సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించారు.తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం ఆగష్టు 23,2024 ను పురస్కరించుకుని దాదాపు నెల రోజుల నుంచి దేశవ్యాప్తంగా మన అంతరిక్ష విజయాలు,మన శాస్త్రవేత్తల ప్రయాణం,రోదసికి నేటి సాంకేతికత అనుసంధానం, అప్లికేషన్లు వంటి ఎన్నో విషయాలకు సంబంధించిన అంశాలపై వివిధ ప్రదర్శనలు, క్విజ్ పోటీలు తదితర కార్యక్రమాలతో భారత ప్రభుత్వం మరియు ఇస్రో వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వసంస్థలతో కలిసి నేటితరపు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతుంది.వారిలో ఆసక్తిని పెంచి భవిష్యత్ లో ప్రముఖ శాస్త్రవేత్తలుగా ఎదగడానికి కృషి చేస్తుంది. భారత అంతరిక్ష రంగం పితామహుడు,విఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త పద్మవిభూషణ్ విక్రమ్ సారాభాయ్ జ్ఞాపకార్థం, గౌరవార్థం ల్యాండర్ కు విక్రమ్ అనే పేరు పెట్టి ఈ అవనిపైనే కాక అంతరిక్షంలో సైతం మన విక్రముడి కీర్తిని యావత ప్రపంచానికి ఘనంగా చాటింది మన దేశం.1957 లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ "స్పుత్నిక్" ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తు అంతా అంతరిక్ష పరిశోధనా ప్రయోగాలతోనే ముడిపడి వుందని గమనించి మన దేశంలో వున్న పేదరికం, నిరుద్యోగం నిరక్షరాస్యత వంటి మహామ్మారులను ఈ దేశం నుంచి తరిమేయాలంటే శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రగామిగా వుండాలని,మన దేశంలోని సామాన్యుల చెంతకు సాంకేతిక పరిజ్ఞానం చేరినప్పుడే మనం అభివృద్ధి చెందిన దేశంగా వుండగలమని బలంగా విశ్వసించిన విక్రమ్ సారాభాయ్ అప్పటి ప్రధాని నెహ్రూని ఒప్పించి, మరో విఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త, భారతీయ అణ్వాస్త్ర రంగ పితామహుడు హోమి జె బాబా పర్యవేక్షణలో 1962 లో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించారు.అది 1969 లో నేటి ఇస్రో గా ఆవిర్భవించింది.కాలక్రమంలో ఉపగ్రహ భాగాలను దేశీయంగా తయారు చేసుకుంటూ తద్వారా ఉపగ్రహ వాహక నౌకలను కూడా తయారుచేసే స్థాయికి ఎదిగాం.చాలా తక్కువ ఖర్చుతో ఎన్నో అసాధారణ మైన ప్రయోగాలు చేసి అగ్రరాజ్యాలకు సైతం శాస్త్రీయంగా సవాళ్లు విసిరాం. 1975 ఏప్రిల్ 19 సోవియట్ యూనియన్ నుండి మన మొదటి శాటిలైట్ "ఆర్యభట్ట"ను విజయవంతంగా ప్రయోగించాం.1980 లో ఎస్సెల్వీతో రోహిణి-1 ఉపగ్రహాన్ని మనదేశం నుంచే ప్రయోగించి మనసత్తా చాటాం.ఇక అప్పటి నుంచి ఎన్నో ఘన విజయాలు సాధించాం.అప్పుడప్పుడు దేశీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో విమర్శలు, అవమానాలు, అవరోధాలు,వైఫల్యాలు ఎదురైనా నిరాశచెందకుండా,పట్టుదల వదలకుండా మన అంతరిక్ష ప్రయాణం అనంత విశ్వాన్వేషణే ఉద్దేశంతో ఎన్నో లక్ష్యాలతో విజయవంతంగా కొనసాగుతూనే వుంది.పి యస్ ఎల్ వీ,జి యస్ ఎల్వీ,భారతీయ అత్యంత బరువైన రాకెట్ వాహక నౌక మార్క్ 3 (ఎల్ వి ఎమ్-3),చంద్రుని పరిశోధనే లక్ష్యంగా చంద్రయాన్ -1,2,3 మిషన్ లతో పాటు మొదటి ప్రయత్నంలోనే అంగారక గ్రహానికి సంబంధించిన విజయవంతమైన ప్రయోగం(2014) మంగళయాన్, సూర్యుని ఉపరితలం రహస్యాన్వేషణే లక్ష్యంగా ఆదిత్య ఎల్ 1 మిషన్ తో పాటు ఎన్నో ప్రయోగాల విజయాలతో మన జాతీయ పతాకాన్ని అంతర్జాతీయ అంతరిక్ష వేదికలపై రెపరెపలాడించాం.పాములను ఆడించే దేశం అని ఒకప్పుడు అవమానించబడ్డ మనమే అంతరిక్ష రాకెట్ ప్రయోగాలను శాసించే స్థాయికి ఎదిగాం.వేరే దేశాల సాయంతో,సైకిల్ పై ఉపగ్రహాల విడిభాగాలు మోసుకెళ్ళి ప్రయోగాలు చేసిన మనం ఒకే రాకెట్ లో 104 ఉపగ్రహాలను పంపించి నేడు అంతరిక్ష వ్యాపారంలో దూసుకెళ్తున్నాం.స్పేస్ నుంచి ఇండియా ఎలా కనిపించిందని ఇందిరాగాంధీ రాకేశ్ శర్మను అడిగితే " సారే జహాసే అచ్ఛా" అంటూ ఆయన బదులిచ్చారు.నిజమే నేడు మనమంతా గట్టిగా అనాల్సిందే మేరా భారత్ మహాన్. ఒకసారి మనం చరిత్రను పరిశీలిస్తే భారతదేశం ప్రపంచ విజ్ఞానానికి గణితం, వైద్యశాస్త్రంతో పాటు ఖగోళశాస్త్రంలో కూడా తన కృషిని అందించింది.కానీ వీటి అభివృద్ధి కొన్ని అంశాలలో కొంతకాలం పాటు మాత్రమే సాగి ఆ తర్వాత కొనసాగ లేకపోయింది.మధ్యయుగంలోనే భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞుల్లో ఆర్యభట్ట,బ్రహ్మగుప్త,మహావీర,వరాహమీర, భాస్కర అతి విశిష్ట ప్రజ్ఞావంతులు.ఆర్యభట్టీయం పుస్తకం భారతీయ ఖగోళ శాస్త్రానికి పునాదయ్యింది.సూర్యచంద్ర క్యాలెండర్,1724 లోనే "జంతర్ మంతర్" ఖగోళ పరిశీలన కేంద్రం వంటివి మన చరిత్రకు సాక్ష్యాలు.స్వాతంత్ర్య భారతంలో కూడా విక్రమ్ సారాభాయ్,సతీష్ ధావన్, అబ్దుల్ కలామ్,మాధవన్ నాయర్ వంటి విఖ్యాత శాస్త్రవేత్తల కృషి అమోఘం.అత్తారింట్లో వంటలకే ఆడవాళ్ళు పరిమితం అనే వివక్షతను దాటి నేడు మన అంతరిక్ష ప్రయోగాల్లో మహిళా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల పాత్ర అమోఘం, ఆదర్శ దాయకం, అభినందనీయం,అనుసరణీయం."మిస్సైల్ మహిళ" టెస్సీ థామస్,నిగర్ షాజీ,కల్పనా కాళహస్తి,నందిని హరినాథ్ వంటి మహిళా శాస్త్రవేత్తలు మనందరికీ స్ఫూర్తి. మన దేశం యొక్క అంతరిక్ష యాత్రల విజయాలను ప్రదర్శించడానికి మరియు యువతను ప్రేరేపించడానికి మన ప్రభుత్వం తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024 సందర్భంగా"చంద్రుని తాకేటప్పుడు జీవితాలను తాకడం: భారతదేశం యొక్క అంతరిక్ష సాగా" అనే థీమ్ తో ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుంది.స్పేస్ ఆన్ వీల్స్ -సైంటిఫిక్ అడ్వాన్స్మెంట్,ఇస్రో స్పేస్ ట్యూటర్స్, భారతీయ అంతరిక్ష హ్యాక్ థాన్, ఫిషరీస్ రంగంలో స్పేస్ టెక్నాలజీ, లెట్స్ బిల్డ్ ఎ స్పేస్ రోబోట్ వంటి అంశాలపై ఎన్నో సెమినార్లు,ప్రదర్శనలు,పోటీలు తదితర వినూత్న కార్యక్రమాలను మన ప్రభుత్వం నిర్వహిస్తుంది.ఈ సందర్భంగా యావత్ దేశం మన శాస్త్రవేత్తల, సాంకేతిక నిపుణుల, ఇంజనీర్ల తదితరుల కృషిని అభినందించాలి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకతీతంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి శాస్త్రవేత్తలను ప్రోత్సహించాలి.ప్రస్తుత ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ గగనయాన్, చంద్రయాన్ -4,5 వంటి ప్రయోగాల గురించి కూడా మీడియాలో ప్రకటించడం జరిగింది భవిష్యత్తులో మన అంతరిక్ష ప్రయోగాలన్నీ విజయవంతం కావాలని ఆశిద్దాం.ఫలితాలు ఏమైనా మన దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మన శాస్త్రవేత్తలను రియల్ హీరోలు గా గౌరవిద్దాం.భారతరత్న అబ్దుల్ కలాం అన్నట్లు "ఆకాశంలోకి నక్షత్రాలను అందుకోవడం లక్ష్యం గా పెట్టుకొండి.ఆ సంకల్పం మీలో బలంగా వుంటే చాలు..! ఏదో ఓ రోజు ఆ నక్షత్రాలే మీ పాదాక్రాంతమవుతాయి" వంటి స్ఫూర్తి వచనాలతో భవిష్యత్తు యువతరం కలాం స్వప్నాలు గా, గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి.

## ఉత్తమ ఉపాధ్యాయుడు అంటే ఎవరు..




విద్యార్థి దశలో మన జీవితంలో అతి ముఖ్యమైన వారు ఇద్దరే. తల్లిదండ్రులు, గురువులు. తల్లిదండ్రులు మన భవిష్యత్తు పట్ల ఆరాటంతో అప్పుడప్పుడు కఠినంగా వ్యవహరించవచ్చు. అతి క్రమశిక్షణ రుద్దవచ్చు. కానీ వేలాది విద్యార్థుల ఎగుడు దిగుడులును చూసిన అనుభవం కలిగిన గురువులు ఆవేశాలకు లోనుకాకుండా ప్రవర్తించగలరు. చదువులో ప్రస్తుతం వెనుకబడిన వారు వెనుకబడినట్లే ఉండరని, ఒకదానిలో కాకపోయినా మరొక దానిలో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి జీవితంలో ముందుకు సాగగలరని వారికి తెలుసు. అందుకే పిల్లలపై ఆందోళన చెందే తల్లిదండ్రులకు, విద్యార్థులకు ధైర్యం చెప్పగలరు, ప్రోత్సహించగలరు. భావి పౌరులలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరు. ఈ విధంగా సమాజాన్ని తీర్చిదిద్దగల మహాశక్తి ఉపాధ్యాయుల చేతిలో ఉన్నదనడం అంగీకరించాల్సిన విషయం. సమాజంలోని వృత్తులన్నిటిలో ఉదాత్తమైనది, పవిత్రమైనది, శక్తివంతమైనది ఉపాధ్యాయ వృత్తి. వారు ఏం ఆశించకుండా విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తారు. ఉడతా భక్తిగా ప్రభుత్వాలు, విద్యార్థులు సెప్టెంబర్ 5న గురువులను సత్కరించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇదే క్రమంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉపాధ్యాయులను సత్కరించడం ఏళ్లుగా జరుగుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గత దశాబ్ద కాలంలో రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయుల అవార్డుల ప్రధాన కార్యక్రమానికి ఏనాడు గౌరవ ముఖ్యమంత్రి హాజరయిన దాఖలాలు లేవు. నూతన సర్కారు ఏర్పడిన తరువాత మొదటిసారి గురువులను గౌరవించే కార్యక్రమానికి గౌరవ ముఖ్యమంత్రి హాజరవుతారా? లేదా అన్నది వేచి చూడాలి.

### గుణం, ఫలితంపై ఆధారపడి ఉంటుందా

ఉత్తమ ఉపాధ్యాయులంటే ఎవరు? వారిని ఉత్తములుగా ఎవరు ఎంపిక చేయాలి? ఎంపికా విధానంలో ప్రస్తుతం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు సరైనవేనా? అనే ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. ఉపాధ్యాయుల సర్వీసు, వారి బోధనా విధానం, సాధించిన ఫలితాలు, సమాజంతో టీచర్లకు గల సత్సంబంధాలు, సామాజిక స్పృహ తదితర అంశాల ఆధారంగా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి ఎంపిక చేయాల్సి ఉండగా దానికి విరుద్ధంగా, అయ్యా నేను ఉత్తముడిని నాకు అవార్డు ఇవ్వండి అని దరఖాస్తు చేసుకోవాల్సిన దుస్థితి నేడు రాష్ట్రంలో నెలకొందనడంలో అతిశయోక్తి లేదు. ఈ క్రమంలో ఒక ప్రొఫార్మా రూపొందించి అందులోని అంశాలను పూరించి సంబంధిత పత్రాలను జతచేసి అధికారులకు అందిస్తే అందులోని అంశాలను ఏవి పరిశీలించకుండా కేవలం సీనియారిటీ ప్రాతిపదికనే ఉత్తములను ఎంపిక చేస్తున్నారనేది వాస్తవం. కొన్ని సందర్భాల్లో ఎటువంటి దరఖాస్తు లేకున్నా, ఎటువంటి పత్రాలు జత చేయకున్నా జాబితాలో పేర్లు చోటు చేసుకోవడం కొస మెరుపు. ఫలితాలు సాధిస్తేనే ఉత్తమ ఉపాధ్యాయుడు అవుతాడా? లేకపోతే కాడా? అతని ఉత్తమ గుణం ఫలితం మీదే ఆధారపడి ఉంటుందా? ఫలితాలు అనేవి పిల్లలకు చదువు పట్ల గల ఆసక్తి, వారి కృషి, వారి మానసిక ఆరోగ్య స్థితిగతులు, ఇంటి పరిస్థితులు, స్నేహాలు మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటాయి. ఈ స్థితుల ప్రభావం ఫలితాల మీద తప్పకుండా ఉంటుంది. అలాంటప్పుడు ఫలితాలకు ఉపాధ్యాయుడిని బాధ్యుడిని చేసి ఫలితాలను ప్రామాణికంగా తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయుడిని ఎంపిక చేయడం సరైనదేనా? అతని బోధన ఎలా ఉన్నదో చూడరా

### పనితీరు ఆధారంగా ఎంపిక ఉండాలని..

దీనికంతటికీ కారణం ఏమిటా..? అని లోతుల్లోకి వెళ్లి పరిశీలిస్తే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం అనే విషయం అవగతమవుతున్నది. మండలానికో విద్యాధికారి, జిల్లాకు ఒక అధికారి ఉన్నట్లయితే ఎంపికా విధానంలో పారదర్శకత ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 615 మండలాలకు కేవలం పదుల సంఖ్యలోనే రెగ్యులర్ ఎంఈఓలు ఉండడం మిగిలిన వారంతా ఇంచార్జులుగా కొనసాగుతుండడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో వారు కార్యాలయాలకే పరిమితమవ్వడంతో విరివిగా పాఠశాలను సందర్శించి, ఉత్తమ టీచర్లను ఎంపిక చేసే తీరిక లేదన్నది నిర్వివాదాంశం. ఈ ఎంపిక విధానాన్ని చాలామంది టీచర్లు వ్యతిరేకిస్తున్నారనేది సత్యం. నేనే ఉత్తముడిని అని తమకు తాను దరఖాస్తు చేసుకునే విధానానికి స్వస్తి పలకాలని క్షేత్రస్థాయిలో మెజారిటీ ఉపాధ్యాయులు కోరుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా ఎంపిక విధానం చేపట్టాలని కోరుతున్నారు. గత ప్రభుత్వాలు అనుసరించిన మూస విధానానికి స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంపిక విధానంలో పైరవీలకు తావు లేకుండా పరిమిత సంఖ్యలో ఉత్తములను ఎంపిక చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వం పైన ఉన్నది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆశిద్దాం.

# బీఆర్ఎస్, ఈ కృత్రిమ ధర్నలు ఎందుకు




సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ ద్వారా దేశ చరిత్రలోనే కొత్త రికార్డును తిరగరాస్తుంటే...తమ రాజకీయ భవిష్యత్తుకు నూకలు చెల్లినట్లే అని వణికిపోతున్న గులాబీ దండు.. తిరగరాయలేని ఈ చరిత్రను అడ్డుకోవడానికి అతి తెలివితో కృత్రిమ ఆందోళనలను సృష్టిస్తూ...భుజాలు చరుచుకుంటోంది. ఓ పక్క శరవేగంగా రుణమాఫీ అమలవుతోంటే... వాళ్లకు రాలేదు.. వీళ్లకు రాలేదు 'అంటూ పొద్దున లేస్తే ఒకటే లొల్లి. అంతటితో ఆగకుండా రుణమాఫీ రాలేదన్న కోపంతో రైతులు ఆందోళనలు చేస్తున్నారంటూ కొన్ని వీడియోలను మీడియాకు రిలీజ్ చేస్తున్నారు. రుణమాఫీ పథకం పూర్తయిందని సీఎం కానీ... మంత్రులు కానీ.. లేదా అధికారులు కానీ ఎక్కడైనా ప్రకటించింద్రా?... లేదు కదా?.. మరి అప్పుడే రుణమాఫీ పథకం ముగిసిపోయినట్లు... వేలాది మంది రైతులకు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసినట్లు ఈ దొంగేడ్పులు ఎందుకు? రుణమాఫీ నిధులు ఖాతాలో జమకాని రైతులు ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్ కార్యాలయాల్లో ప్రతేక సెల్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది కదా?... మరి అప్పుడే ఆందోళనలు.. ధర్నాలు ఎందుకు చేస్తున్నట్లు?... ఎవరు చేయిస్తున్నట్లు?...

### ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ..

కారు గ్యారేజీకి చేరుకోవడం ఖాయంగా మారడానికి కారణమైన సీఎం రేవంత్ రెడ్డిపై బురద జల్లడం ద్వారా ఆనందంతో గంతులేసేందుకు బీఆర్ఎస్ నేతలు సాగిస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే పాపం అనిపించక మానదు. ఎందుకంటే? ఆగస్టు 15 వరకు మూడు విడతల్లో రుణమాఫీ చేస్తానని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసింది. మొత్తం మూడు విడతల్లో.. రుణ విముక్తులైన రైతులు 22,37,848 - రైతుల ఖాతాల్లో జమ చేసిన నిధులు రూ.17,934 కోట్లు. మిగిలిన రైతులకూ వరుసగా రుణాలు మాఫీ అవుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. మొత్తం 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పింది. జూలై 15వ తేదీన రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం.. మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడం మొదలు పెట్టింది.

### రైతులను మోసం చేశారంటూ..

కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.37 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నిధులు జమ చేయటం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారి. రూ.2 లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు చివరి విడతగా నిధులు కేటాయించనున్నట్లు రుణమాఫీ విధి విధానాల్లో ప్రభుత్వం ముందుగానే వెల్లడించింది. అయితే సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ జరగడంలో జాప్యం జరగడం నిజమే. కానీ...రైతులకు సంబంధించి సరైన వివరాలు అప్ లోడ్ చేయకపోవడం వంటివి దీనికి కారణం. రైతులు బ్యాంకులకు సరైన వివరాలు అందించకపోవడం... 2 లక్షలకు మించి రుణం ఉండటం...ఇది ప్రభుత్వానికి సంబంధించిన విషయం కాదు. అయినప్పటికీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని అబద్దాలను ప్రచారం చేస్తున్నారు. గులాబీ పార్టోళ్లు గిన్ని విమర్శలు చేస్తున్నరు కదా?... పదేళ్ల కాలంలో మీరు ఎన్ని వేల కోట్లు మాఫీ చేసింద్రో ఒక్కసారి గుండెల మీద చెయ్యేసుకుని సెప్పుండ్రి. పదేళ్లలో మీరిచ్చింది 20వేల కోట్లు కూడా దాటలే. అయినా రైతులంటే మీకు ఎంతో ప్రేమ ఉన్నట్లు ఒగలేడ్పులు ఎందుకు?. మీరెన్ని ఒగలేడ్పులు ఏడ్చినా... నమ్మెటోడెవడు?